

పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా


Postal No: 3-78(D)-2026-2028

RNI APTEL 2013/54510

Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ | సంపుటి -14 | సంచిక - 320 | పేజీలు - 08 | వెల - 05/- | మంగళవారం 17-11-2026





విజయవాడలో ఘనంగా అవార్డుల ప్రదానోత్సవం

పురస్కార గ్రహీతల్లో ఐదుగురు మహిళలు

- విజయవాడలో రామోజీ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవం
- మొత్తం తొమ్మిది మంది విశిష్ట వ్యక్తులకు పురస్కారాలు

విజయవాడ వేదికగా ప్రతిష్ఠాత్మక 'రామోజీ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2026' ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. రామోజీ గ్రూప్ వ్యవస్థాపకుడు దివంగత

వేడుకకు హాజరైన కేంద్ర మంత్రి అమిత్ షా, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

రామోజీరావు జయంతి ఇకపై రాష్ట్ర పండుగ

- రామోజీరావు జయంతిని అధికారిక రాష్ట్ర పండుగగా ప్రకటించిన ఏపీ ప్రభుత్వం
- రామోజీ ఎక్సలెన్స్ అవార్డ్స్ సభలో పాల్గొన్న అమిత్ షా, గవర్నర్ అబ్దుల్ నజీర్, చంద్రబాబు, పవన్ కళ్యాణ్
- తొమ్మిది రంగాల్లో విశేష సేవలు అందించిన ప్రముఖులకు అవార్డుల ప్రదానం
- రాజధాని అమరావతి పేరును శాస్త్రీయంగా సూచించింది రామోజీరావేనన్న సీఎం



తెలుగు జాతి గర్వించదగ్గ మహనీయుడు, పద్మవిభూషణ్ స్వర్గీయ రామోజీరావు జయంతిని ఇకపై ప్రతి ఏటా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికారికంగా 'రాష్ట్ర పండుగ'గా నిర్వహిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఆయన తెలుగు జాతికి, రాష్ట్రానికి అందించిన నిరుపమాన సేవలను చిరస్మరణీయం చేయడానికే

రామోజీరావు సేవలను స్మరించిన పవన్

- రామోజీ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవంలో పాల్గొన్న ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- వ్యక్తిగత విజయం కంటే సమాజంలో తెచ్చే మార్పే గొప్పదని ఉద్ఘాటన
- దివంగత రామోజీరావు పట్టుదల, సమాజహిత సేవలను స్మరించుకున్న



రామోజీరావు

90వ జయంతి వేడుకలు

● వివిధ రంగాల్లో విశేష సేవలందించిన ప్రతిభావంతులకు రామోజీరావు ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానం ● ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా ప్రజాస్వామ్య నాలుగో స్తంభాన్ని కాపాడారని ప్రశంస ● మోదీ ప్రమాణ స్వీకార సమయంలో రామోజీరావుతో జరిగిన తొలి పరిచయం గుర్తుచేసుకున్న వైనం



మీడియా రంగంలో నైతిక విలువలతో కూడిన జర్నలిజానికి రామోజీరావు తిరుగులేని ప్రతీకగా నిలిచారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా కొనియాడారు. ఆయన కేవలం ఒక వ్యక్తి మాత్రమే కాదని, తన జీవితకాలంలోనే సమాజానికి

ఢిల్లీలో ఘనంగా విడుదలైన సోనియా గాంధీ ఆత్మకథ

'బిలాంగింగ్:



2


హైదరాబాద్‌లోని చర్లపల్లి రైల్వే స్టేషన్‌లో భారీ

అగ్నిప్రమాదం

- ప్లాట్‌ఫారాలు 5, 6 మధ్య నిలిపి ఉంచిన ఖాళీ కోచ్‌లో చెలరేగిన మంటలు
- సకాలంలో స్పందించి మంటలను అదుపు చేసిన అగ్నిమాపక సిబ్బంది
- కోచ్ ఖాళీగా ఉండటంతో తప్పిన పెను ప్రమాదం
- ప్రమాదానికి గల కారణాలపై దక్షిణ మధ్య రైల్వే దర్యాప్తు

2

హైదరాబాద్‌లోని చర్లపల్లి రైల్వే స్టేషన్‌లో సోమవారం సాయంత్రం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. స్టేషన్‌లోని 5, 6 నంబర్ ప్లాట్‌ఫారాల మధ్య ట్రాక్‌పై నిలిపి ఉంచిన ఒక ఖాళీ రైలు బోగీలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి.



ఏపీలో రెండో విడత

పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

- నవంబర్ 29న పోలింగ్, అదే రోజు ఓట్ల లెక్కింపు
- ఈ నెల 18 నుంచి 20 వరకు నామినేషన్ల స్వీకరణ
- రెండో దశలో 4,960 సర్పంచ్, 49,224 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు
- మొత్తం మూడు విడతల్లో రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ ఎన్నికల నిర్వహణ

ఏపీలో గ్రామ పంచాయతీ ఎన్నికల రెండో విడతకు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) ఈరోజు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ షెడ్యూల్ ప్రకారం నవంబర్ 29న పోలింగ్ జరగనుంది. ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఈ నెల 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు.




2

సీఆర్‌పీఎఫ్ పోస్టుపై దాడి కేసులో కీలక పరిణామం..

ఉగ్రవాది మృతి

- జమ్మూకశ్మీర్‌లోని కుల్గాంలో ఎన్‌కౌంటర్
- లష్కరే తోయిబా ఉగ్రవాది భట్ హతం
- మరో ఉగ్రవాది భద్రతా బలగాల ఉచ్చులో చిక్కుకున్నట్టు సమాచారం
- ఈ నెల 11న మీర్‌బజార్ సమీపంలోని సీఆర్‌పీఎఫ్ పోస్టుపై కాల్పుల్లో ముగ్గురు జవాన్లకు గాయం
- ఆ తర్వాత కిష్త్వార్‌లో ఇద్దరు ఎస్‌పీఓలు హత్య

మిగతాది 2లో





2లో

తెలంగాణ పదో

తరగతి విద్యార్థులకు ఊరట..

- ఆలస్య రుసుము లేకుండా నవంబర్ 26 వరకు అవకాశం
- జనవరి 4 వరకు ఆలస్య రుసుముతో చెల్లింపులకు ఛాన్స్
- ఎస్సీ ఎస్టీ బీసీ విద్యార్థులకు ఫీజు మినహాయింపు
- ఆన్‌లైన్‌లో మాత్రమే ఫీజు చెల్లించాలని స్పష్టీకరణ

తెలంగాణలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు (ఎస్ఎస్సీ 2027) రాయబోయే విద్యార్థులకు పాఠశాల విద్యాశాఖ కీలక సమాచారం అందించింది. పరీక్ష ఫీజు చెల్లింపు గడువును పొడిగిస్తూ, సవరించిన నూతన షెడ్యూల్‌ను అధికారికంగా విడుదల చేసింది. ఫీజు చెల్లింపు ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించింది.సవరించిన షెడ్యూల్ ప్రకారం.. ఎలాంటి ఆలస్య రుసుము


ఈ నెల 20న కోస్తాంధ్రను తాకనున్న

తీవ్ర తుపాను..

ఆర్టీజీఎస్ కేంద్రంలో అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష

- బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం
- ఈ సాయంత్రానికి తుపానుగా మారే అవకాశం
- గోదావరి, కృష్ణా, గుంటూరు సహా పలు జిల్లాలపై ప్రభావం
- ప్రభావిత ప్రాంతాలకు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు

ఈ నెల 20వ తేదీన కోస్తాంధ్ర తీరాన్ని తీవ్ర తుపాను తాకనుందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. తుపాను ముప్పు పొంచి ఉన్నందున క్షేత్రస్థాయిలో అవసరమైన అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని సచివాలయంలో ఉన్న ఆర్టీజీఎస్ (రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ) కేంద్రం నుంచి ఆయన అధికారులతో తాజా పరిస్థితిపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం బంగాళాఖాతంలో కేంద్రీకృతమై ఉన్న తీవ్ర వాయుగుండం క్రమంగా బలపడుతోందని, ఇవాళ సాయంత్రానికి ఇది తుపానుగా మారే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. దీని ప్రభావంతో ఈ నెల 19, 20 తేదీల్లో కోస్తాంధ్ర తీర ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే వీలుందని తెలిపారు. గతంలో వచ్చిన అర్నబ్ తుపాను తరహాలోనే దీని తీవ్రత



2

కూడా ఉండే అవకాశం ఉందని అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు.రానున్న తుపాను ప్రభావం ప్రధానంగా అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాలతో పాటు పరిసర ప్రాంతాలపై ఎక్కువగా ఉండే అవకాశం ఉందని వాతావరణ విభాగం అంచనా వేసింది.

కరీంనగర్ సీపీ వివాదం

: పాడి కౌశిక్ రెడ్డికి హైకోర్టులో ఎదురుదెబ్బ

ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పిటిషన్‌ను కొట్టివేసిన హైకోర్టు

పోలీసులకు గొంతు నమూనాలు ఇవ్వాల్సిందేనని కోర్టు స్పష్టీకరణ

మిగతాది 2లో



సీఆర్‌పీఎఫ్ పోస్టుపై దాడి కేసులో కీలక పరిణామం.. ఉగ్రవాది మృతి

జమ్మూకశ్మీర్‌లోని కుల్గాం జిల్లాలో భద్రతా బలగాలు, ఉగ్రవాదులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో లష్కరే తోయిబాకు చెందిన ఓ ఉగ్రవాది హతమయ్యాడు. మరో ఉగ్రవాది భద్రతా బలగాల ఉచ్చులో చిక్కుకున్నట్లు పోలీసులు సోమవారం వెల్లడించారు. హతమైన ఉగ్రవాది భట్ స్థానికుడని, పాకిస్థాన్ ఉగ్రవాదులతో కలిసి పనిచేస్తున్నట్లు అనుమానిస్తున్నారు.

ఈ నెల 11న కుల్గాంలోని మీర్‌బజార్ సమీపంలో ఉన్న సీఆర్‌పీఎఫ్ పోస్టుపై ఇద్దరు భారీగా ఆయుధాలు కలిగిన ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ముగ్గురు జవాన్లు గాయపడగా.. ఒకరి పరిస్థితి విషమంగా మారింది. అనంతరం ఉగ్రవాదులు అటవీ ప్రాంతంలోకి పారిపోయారు. అప్పటి నుంచి వారిని పట్టుకునేందుకు భద్రతా బలగాలు గాలింపు చేపట్టాయి.

హతమైన భట్ ఈ ఏడాది జరిగిన పలు ఉగ్రదాడుల్లోనూ నిందితుడిగా ఉన్నట్లు సమాచారం. జులై 22న అనంతనాగ్‌లోని లాల్‌చౌక్ ప్రాంతంలో పోలీసు కానిస్టేబుల్ హత్య, జులై 31న కుల్గాంలో వలస కార్మికుల హత్య ఘటనల్లో అతడి ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలున్నాయి. పాకిస్థాన్ ఉగ్రవాదులకు స్థానికంగా ఆశ్రయాలు కల్పించే నెట్‌వర్క్ సాయంతో దక్షిణ కశ్మీర్‌లో సంచరిస్తున్నట్లు అధికారులు భావిస్తున్నారు.

కుల్గాం దాడి జరిగిన 24 గంటల్లోపే కిష్త్వార్‌లో ఇద్దరు ప్రత్యేక పోలీసు అధికారులు (ఎస్‌పీఓలు) బాబీ చంద్, యశ్‌పాల్ కుమార్ హత్యకు గురయ్యారు. ఈ పరిణామాల నేపథ్యంలో జమ్మూకశ్మీర్ అంతటా అప్రమత్తత పెంచినట్లు సీఆర్‌పీఎఫ్ ప్రత్యేక డీజీ సందీప్ ఖిర్వార్ తెలిపారు.

కశ్మీర్ లోయలో సజీవంగా ఉన్న ఏకైక ఉగ్రవాది అబ్దుల్ లతీఫ్ భట్ మాత్రమేనని భద్రతా బలగాలను ఉటంకిస్తూ ఇటీవల పలు వార్తా కథనాలు వెలువడ్డ విషయం తెలిసిందే. తాజాగా మరణించింది అతడేనని స్పష్టమవుతోంది. అతడిని పట్టుకున్నా లేదా సమాచారం అందించినా రూ. 15 లక్షల రివార్డు కూడా ఇస్తామని ఇటీవల కశ్మీర్‌లో పోస్టర్లు వెలసిన విషయం తెలిసిందే. తాజా ఎన్‌కౌంటర్‌తో లోయలో ఉన్న ఏకైక స్థానిక ఉగ్రవాది మరణించినట్లయింది. దీన్ని ఇంకా పోలీసులు ధ్రువీకరించాల్సి ఉంది.

కరీంనగర్ సీపీ వివాదం: పాడి కౌశిక్ రెడ్డికి హైకోర్టులో ఎదురుదెబ్బ

కరీంనగర్ పోలీస్ కమిషనర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి తెలంగాణ హైకోర్టులో చుక్కెదురైంది. తన గొంతు నమూనాలు (వాయిస్ శాంపిల్స్) ఇవ్వాలని పోలీసులు జారీ చేసిన నోటీసులను సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. దీంతో ఆయన పోలీసు దర్యాప్తునకు సహకరించి వాయిస్ శాంపిల్స్ ఇవ్వక తప్పని పరిస్థితి ఏర్పడింది.

కేసు నేపథ్యం:ఈ ఏడాది జనవరి 29న జరిగిన మినీ మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర సందర్భంగా అప్పటి కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంపై పాడి కౌశిక్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారని, పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనపై కరీంనగర్ జిల్లా వీణవంక పోలీస్ స్టేషన్‌లో ఆయనపై కేసు నమోదైంది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఘటన నాటి ఆడియో, వీడియో రికార్డులను పరిశీలించిన పోలీసులు.. వాటిని సరిపోల్చేందుకు (ఖీశీతీవఅంఅష ఖశీఎజూఖతీఱ-ంశీఅ) కౌశిక్ రెడ్డి గొంతు నమూనాలను సేకరించాలని నిర్ణయించారు.

కోర్టులో వాదనలు:వాయిస్ శాంపిల్స్ సేకరణకు సంబంధించి మేజిస్ట్రేట్ కోర్టు అనుమతి ఇవ్వడంతో దర్యాప్తు అధికారులు కౌశిక్ రెడ్డికి నోటీసులు జారీ చేశారు. అయితే, కింది కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను, పోలీసు నోటీసులను రద్దు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే హైకోర్టులో రివిజన్ పిటిషన్ వేశారు. పోలీసుల చర్య చట్టవిరుద్ధమని, తన హక్కులను కాలరాయడమేనని కౌశిక్ రెడ్డి తరఫు న్యాయవాదులు వాదించారు.

మరోవైపు ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. నేర విచారణలో భాగంగా ఆధారాలను శాస్త్రీయంగా ధ్రువీకరించేందుకు నిందితుల వాయిస్ శాంపిల్స్ సేకరించడం సాధారణ ప్రక్రియేనని స్పష్టం చేశారు. ఇరుపక్షాల వాదనలను క్షుణ్ణంగా పరిశీలించిన హైకోర్టు.. దర్యాప్తు ప్రక్రియలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేస్తూ కౌశిక్ రెడ్డి పిటిషన్‌ను కొట్టివేసింది.

ఢిల్లీలో ఘనంగా విడుదలైన సోనియా గాంధీ ఆత్మకథ 'బిలాంగింగ్

కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ రచించిన ఆత్మకథ 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' దేశ రాజధాని ఢిల్లీలో సోమవారం ఘనంగా ఆవిష్కృతమైంది. ఈ పుస్తకావిష్కరణ వేదికపై సోనియా గాంధీ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హత్యకు గురైన తర్వాత తాను పూర్తిగా కుంగిపోయానని, ఆ క్లిష్ట సమయంలో తన పిల్లలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాలే తనకు తల్లిదండ్రులై నిలబడి అండగా నిలిచారని ఆమె గుర్తుచేసుకున్నారు.

ఈ కార్యక్రమానికి రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలతో పాటు 'ఇండియా' కూటమికి చెందిన పలువురు అగ్రనేతలు, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. సభ ప్రారంభంలో సోనియా గాంధీ జీవిత ప్రస్థానంపై రూపొందించిన ఒక లఘు చిత్రాన్ని ప్రదర్శించగా, అది చూసి ఆమె కంటతడి పెట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. వేరొక దేశం నుంచి ఇక్కడికి వచ్చి భారతదేశంతో ఒక బలమైన అనుబంధాన్ని పెనవేసుకోవడానికి పడిన శ్రమకు ఈ పుస్తకం ఒక నిదర్శనమని పేర్కొన్నారు.

"బిలాంగింగ్ అంటే మనం ఆ సమాజంలో ఒకరిగా భాగమవడం. బయటి వ్యక్తిగా ఉన్నప్పుడు ఎవరూ మనల్ని ఇష్టపడటం లేదనే భావన, నిరంతరం మనల్ని ఎవరో గమనిస్తున్నారన్న ఆలోచన కలుగుతుంది" అని ఆమె చెప్పారు. ఈ పుస్తకానికి వస్తున్న అద్భుతమైన ఆదరణ తనను ఎంతగానో తాకిందని ఆమె తెలిపారు. హార్పర్‌కాలిన్స్ ఇండియా ప్రచురించిన ఈ 544 పేజీల ఆత్మకథ నవంబర్ 10న మార్కెట్లోకి రాగా, ఇప్పటికే దాదాపు 2 లక్షల ప్రతులు అమ్ముడయ్యాయి. రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత ఇటలీలో తన బాల్యం, కేంబ్రిడ్జ్‌లో రాజీవ్ గాంధీతో పరిచయం, నెహ్రూ-గాంధీ కుటుంబంతో జీవితం, ఎదురైన వ్యక్తిగత విషాదాలు, ఆ తర్వాత ప్రజా జీవితంలోకి అడుగుపెట్టడం వంటి ఎన్నో అంశాలను ఆమె ఈ పుస్తకంలో వివరించారు. తమ కుటుంబం గురించి ప్రచారంలో ఉన్న అవాస్తవ కథనాలకు తెరదించుతూ, ప్రేమ, వియోగం, అనుబంధాల కలయికగా సాగిన తన నిజ జీవిత ప్రయాణాన్ని పంచుకోవడమే ఈ పుస్తక ప్రధాన ఉద్దేశమని ఆమె స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ ఒక ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. కేంబ్రిడ్జ్‌లోని 'వర్సిటీ రెస్టారెంట్'లో తన తల్లిదండ్రులు తొలిసారి కలుసుకున్నారని చెప్పారు. ఆ తర్వాత ఎప్పుడో తాను కేంబ్రిడ్జ్ వెళ్లినప్పుడు ఆ రెస్టారెంట్‌కు వెళ్లి తన తల్లిదండ్రుల గురించి అడిగానని, ఇన్నాళ్లయినా అక్కడి సిబ్బంది ఇప్పటికీ వారిద్దరినీ గుర్తుపెట్టుకున్నారని తెలిపారు. చాలామంది తన తల్లిని ఇంట్రావర్ట్ (అంతర్ముఖురాలు) అనుకుంటారని, కానీ వాస్తవానికి ఆమె అందరితో ఎంతో కలివిడిగా మాట్లాడే వ్యక్తి అని రాహుల్ చెప్పారు. ఈ పుస్తకం తన తండ్రికి చెందినదని, దానిని తల్లి రాశారని ఆయన పేర్కొన్నారు.ఈ పుస్తకావిష్కరణ సభకు తెలంగాణ, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్, కేరళ రాష్ట్రాల ముఖ్యమంత్రులతో పాటు తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్, ఝార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్, జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా, సమాజ్ వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, డింపుల్ యాదవ్ తదితర విపక్ష నేతలు హాజరయ్యారు. వేదిక ముందు వరుసలో తమిళనాడు ముఖ్యమంత్రితో కలిసి రాహుల్ గాంధీ ఆసీనులయ్యారు.

రామోజీరావు జయంతి ఇకపై రాష్ట్ర పండుగ

'రామోజీ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2026' ప్రదానోత్సవ కార్యక్రమంలో చంద్రబాబు ఈ మేరకు ప్రకటన చేశారు. విజయవాడలోని బీఆర్ అంబేద్కర్ ఆడిటోరియంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరుకాగా.. ఏపీ గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, కె. రామ్మోహన్ నాయుడు, రామోజీ గ్రూప్ సంస్థల చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జర్నలిజం, కళలు-సంస్కృతి, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, మహిళా సాధికారత, సైన్స్ అండ్ టెక్నాలజీ, సామాజిక సేవ, యూత్ ఐకాన్, విద్య-వైద్యం రంగాల్లో విశేష సేవలు అందించిన 9 మంది ప్రముఖులకు రామోజీ ఎక్సలెన్స్ అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలకు, రామోజీ గ్రూప్ సీఎండీ కిరణ్‌కు, వారి కుటుంబ సభ్యులకు సీఎం చంద్రబాబు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ రామోజీరావుతో తనకు 1980 నుంచి దాదాపు 45 ఏళ్లకు పైగా ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. "నేను తొలిసారి ముఖ్యమంత్రి అయిన సమయంలో రామోజీరావు గారు నాతో ఒక స్పష్టమైన మాట చెప్పారు. 'నేను ప్రభుత్వంలో మీ నుంచి నా కోసం గానీ, నా మనుషుల కోసం గానీ ఏ పనీ అడగను. అలాగే మీరూ కూడా మా సంస్థ విషయంలో ఇది రాయాలనో, రాయకూడదనో, ఎవరినైనా బదిలీ చేయాలనో అడగొద్దు. మీరు ప్రజలకు మంచి చేస్తే 24 గంటలూ మీకు మద్దతుగా నిలుస్తా.. అదే తప్పు చేస్తే మాత్రం చాకిరేవు తప్పదు' అని నిర్మొహమాటంగా చెప్పారు. విలువలకు కట్టుబడి పనిచేయడం ఆయనకే సాధ్యమైంది" అని చంద్రబాబు పేర్కొన్నారు.

ఈనాడు వార్తాపత్రిక విశ్వసనీయత గురించి ప్రస్తావిస్తూ.. రాత్రి 9 గంటలకు టీవీలలో ఎన్ని వార్తలు చూసినా, ఉదయం ఈనాడు పత్రిక చూసి వార్తను నిర్ధారించుకునే స్థాయి క్రెడిబిలిటీని రామోజీరావు సాధించారని సీఎం కొనియాడారు. "ఆధారాలు (డాక్యుమెంటరీ ఎవిడెన్స్) ఉంటే తనపై వార్త వచ్చినా కూడా ప్రచురించాలని జర్నలిస్టులకు పూర్తి స్వేచ్ఛనిచ్చిన మహోన్నత వ్యక్తి ఆయన. సాధారణ వ్యక్తులను ఎంచుకుని అసాధారణ ప్రతిభావంతులుగా తీర్చిదిద్దిన శిల్పి రామోజీరావు" అని ప్రశంసించారు.

ఆంధ్రప్రదేశ్ నూతన రాజధానిగా 'అమరావతి' పేరు వెనుక రామోజీరావు చేసిన పరిశోధన ఎంతో ఉందని చంద్రబాబు గుర్తుచేశారు. శాస్త్రీయంగా, చారిత్రకంగా ఎందుకు అమరావతి పేరు పెట్టాలో పూర్తి అధ్యయనం చేసి తనకు సూచించారని, ఆ పేరును యావత్ ప్రజానీకం నూటికి నూరు శాతం ఆమోదించిందని తెలిపారు. అమరావతి నిర్మాణానికి రామోజీ గ్రూప్ తరఫున రూ. 10 కోట్ల విరాళం అందించారని, కరోనా సమయంలోనూ రెండు తెలుగు రాష్ట్రాలకు చెరో రూ. 10 కోట్లు ఇచ్చారని గుర్తుచేశారు. లాతూర్ భూకంపం, సునామీ, హుద్‌హుద్ వంటి ప్రకృతి విపత్తుల సమయంలో బాధితులకు అండగా నిలవడమే కాకుండా, ప్రజల నుంచి సేకరించిన ప్రతి పైసాకు పూర్తిస్థాయిలో లెక్కలు చూపించిన నైతికత రామోజీ గ్రూప్‌దని కొనియాడారు.

జీవిత చరమాంకంలో 86 ఏళ్ల వయసులో అనారోగ్యంతో మంచానికే పరిమితమైన సమయంలోనూ రాజకీయ కుట్రలతో రామోజీరావును ఇబ్బందులకు గురిచేశారని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. మంచంపై ఉన్న వీడియోలను బయటకు విడుదల చేసి మానసికంగా దెబ్బతీయాలని చూసినా ఆయన ఏనాడూ తలవంచలేదని, సిద్ధాంతం కోసం రాజీలేని పోరాటం చేశారని అన్నారు. రామోజీరావు తెలుగు జాతికి దక్కిన ఒక గొప్ప ఆస్తి అని, ఆయన జీవితం నేటి యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. రామోజీరావు తమ కుటుంబానికి ఇచ్చింది కేవలం ఆస్తులు మాత్రమే కాదని, సమాజ హితం కోసం నిలబడే ఒక గొప్ప బాధ్యతను ఇచ్చారని, ఆ విలువలను ఎప్పటికీ ముందుకు తీసుకెళ్లాలని రామోజీ కుటుంబ సభ్యులకు చంద్రబాబు ఆకాంక్షించారు.

రామోజీరావు 90వ జయంతి వేడుకలు

జర్నలిజానికి రామోజీరావు తిరుగులేని ప్రతీకగా నిలిచారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా కొనియాడారు. ఆయన కేవలం ఒక వ్యక్తి మాత్రమే కాదని, తన జీవితకాలంలోనే సమాజానికి మార్గదర్శనం చేసే ఒక మహోన్నత వ్యవస్థగా ఎదిగారని ప్రశంసించారు. రామోజీ గ్రూప్ వ్యవస్థాపకులు రామోజీరావు 90వ జయంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన విశిష్ట కార్యక్రమంలో వివిధ రంగాల్లో నిష్ణాతులైన ప్రతిభావంతులకు 'రామోజీరావు ఎక్సలెన్స్ అవార్డుల'ను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, కింజరాపు రామ్మోహన్ నాయుడు, భూపతిరాజు శ్రీనివాస వర్మ, రామోజీ గ్రూప్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ కిరణ్ తదితరులు హాజరయ్యారు. సభనుద్దేశించి కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రసంగిస్తూ.. తొలుత తాను గొప్పదైన తెలుగు భాషలో మాట్లాడలేకపోతున్నందుకు సభికులకు క్షమాపణలు తెలిపారు. అనంతరం రామోజీరావుతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ తొలిసారి ప్రమాణస్వీకారం చేసిన సమయంలో తీవ్ర రద్దీ వల్ల తన వాహనం ముందుకుపోలేకపోయిందని.. ఆ సమయంలో చంద్రబాబు, రామోజీరావు కలసి తనను వారి కారులో ఎక్కించుకుని గుజరాత్ భవన్‌కు చేర్చారని, ఆ విధంగా రామోజీరావుతో తొలి పరిచయం ఏర్పడిందని వివరించారు. ఆ తర్వాత బీజేపీ అధ్యక్షుడిగా, కేంద్ర హోంమంత్రిగా నాలుగు సార్లు రామోజీ ఫిల్మ్ సిటీలో ఆయన్ను కలిసే అవకాశం లభించిందని తెలిపారు.

ఏపీలో రెండో విడత పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

నవంబర్ 21న ఉదయం 8 గంటల నుంచి నామినేషన్ల పరిశీలన ఉంటుంది. తిరస్కరణకు గురైన అభ్యర్థులు 22వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అప్పీల్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. ఈ అప్పీళ్లపై 23న విచారణ జరిపి తుది నిర్ణయం తీసుకుంటారు. నామినేషన్ల ఉపసంహరణకు నవంబర్ 24 మధ్యాహ్నం 3 గంటల వరకు గడువు విధించారు. అదే రోజు అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు. నవంబర్ 29న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహిస్తారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి, అదే రోజు ఫలితాలను వెల్లడిస్తారు. గెలిచిన అభ్యర్థులతో ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహిస్తారు. ఏవైనా కారణాలతో పోలింగ్ నిలిచిపోతే, అవసరమైన చోట నవంబర్ 30న రీ-పోలింగ్ జరుపుతారు. రెండో విడతలో భాగంగా రాష్ట్రంలో 4,960 సర్పంచ్ పదవులకు, 49,224 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. తొలి విడత పోలింగ్ నవంబర్ 26న, మూడో విడత డిసెంబర్ 2న జరగనుంది. ఈ మూడు దశల్లో కలిపి మొత్తం 13,167 సర్పంచ్, 1.32 లక్షలకు పైగా వార్డు సభ్యుల స్థానాలను భర్తీ చేయనున్నారు.

ఈ నెల 20న కోస్తాంధ్రను తాకనున్న తీవ్ర తుపాను..

పశ్చిమ గోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాలతో పాటు పరిసర ప్రాంతాలపై ఎక్కువగా ఉండే అవకాశం ఉందని వాతావరణ విభాగం అంచనా వేసింది. తుపాను కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎప్పటికప్పుడు అంచనా వేయాలని సీఎం సూచించారు. గతంలో కేంద్ర బృందం చేసిన సిఫార్సులను పరిగణనలోకి తీసుకుని, వాటిని క్షేత్రస్థాయిలో పక్కాగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. తీవ్ర ప్రభావం ఉండే అవకాశమున్న ప్రాంతాలకు ముందస్తుగానే ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను తరలించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తుపాను కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే ఏమాత్రం ఆలస్యం చేయకుండా, యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించేలా సిబ్బందిని, యంత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. అదే సమయంలో భారీ వర్షాల వల్ల వచ్చే వరద నీటిని సమర్థవంతంగా రిజర్వాయర్లకు మళ్లించేలా చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు.

తెలంగాణ పదో తరగతి విద్యార్థులకు ఊరట..

సవరించిన షెడ్యూల్ ప్రకారం.. ఎలాంటి ఆలస్య రుసుము (లేట్ ఫీజు) లేకుండా నవంబర్ 26 వరకు పరీక్ష ఫీజును చెల్లించవచ్చు. ఆ గడువు ముగిసిన తర్వాత రూ. 50 ఆలస్య రుసుముతో డిసెంబర్ 8 వరకు అవకాశం కల్పించారు. రూ. 200 అపరాధ రుసుముతో డిసెంబర్ 10 నుంచి డిసెంబర్ 21 వరకు, రూ. 500 ఆలస్య రుసుముతో డిసెంబర్ 23 నుంచి జనవరి 4 వరకు ఫీజు చెల్లించేందుకు వెసులుబాటు కల్పించారు.

ఫీజుల వివరాలను పరిశీలిస్తే.. రెగ్యులర్ విద్యార్థులు మూడు లేదా అంతకంటే ఎక్కువ సబ్జెక్టులు రాసేందుకు రూ. 125 ఫీజుగా నిర్ణయించారు. మూడు సబ్జెక్టుల వరకు మాత్రమే రాసేవారు రూ. 110 చెల్లించాల్సి ఉంటుంది. ఒకేషనల్ కోర్సు విద్యార్థులు రెగ్యులర్ ఫీజుకు అదనంగా మరో రూ. 60 చెల్లించాలి. అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన విద్యార్థులకు పరీక్ష ఫీజు నుంచి పూర్తి మినహాయింపు ఇచ్చారు. పరీక్ష ఫీజు చెల్లింపు విధానంపై విద్యాశాఖ స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. ఫీజు మొత్తాన్ని అధికారిక వెబ్‌సైట్ ఎంవ్.వశ్రీఅఅస్త్రుఅఱ.స్త్రశీజ.అఅ ద్వారా కేవలం ఆన్‌లైన్ పద్ధతిలోనే పాఠశాల లాగిన్ ఉపయోగించి చెల్లించాల్సి ఉంటుంది. మాన్యువల్ ఐఎఫ్ఎంఎస్ (xఖీమీ) చలాన్లు లేదా బ్యాంకుల ద్వారా నేరుగా తీసే ఫిజికల్ చలాన్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదించబోమని స్పష్టం చేసింది. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల వివరాలను పరిశీలించి, నిర్ణీత గడువులోగా ఆన్‌లైన్ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులు సూచించారు.

హైదరాబాద్‌లోని చర్లపల్లి రైల్వే స్టేషన్‌లో భారీ అగ్నిప్రమాదం

మధ్య ట్రాక్‌పై నిలిపి ఉంచిన ఒక ఖాళీ రైలు బోగీలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. అయితే ప్రమాదం జరిగిన సమయంలో ఆ బోగీలో ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతో పెను ముప్పు తప్పింది. సాయంత్రం సుమారు 6:30 గంటల సమయంలో రైలు బోగీ నుంచి దట్టమైన పొగలు, మంటలు ఎగసిపడటాన్ని గుర్తించిన స్టేషన్ సిబ్బంది వెంటనే అప్రమత్తమయ్యారు. ఆలస్యం చేయకుండా 6:35 గంటలకు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ ఇంజిన్లు, సిబ్బంది తీవ్రంగా శ్రమించి సాయంత్రం 7:15 గంటల కల్లా మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు. సకాలంలో మంటలను ఆర్పడంతో అవి పక్కనే ఉన్న ఇతర కోచ్‌లకు గానీ, ప్లాట్‌ఫారానికి గానీ వ్యాపించలేదు. ఈ ఘటనపై దక్షిణ మధ్య రైల్వే (గాజ=) అధికారికంగా స్పందించింది. మంటలు చెలరేగిన బోగీ పూర్తిగా ఖాళీగా ఉందని, ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదని, ప్రాణనష్టం జరగలేదని అధికారులు స్పష్టం చేశారు. అయితే రైలు బోగీలో మంటలు చెలరేగడానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టినట్లు రైల్వే శాఖ వెల్లడించింది. ప్రమాద తీవ్రత సకాలంలో తగ్గడంతో స్టేషన్ అధికారులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

విజయవాడలో ఘనంగా అవార్డుల ప్రదానోత్సవం

ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. రామోజీ గ్రూప్ వ్యవస్థాపకుడు దివంగత రామోజీరావు పేరిట ఏర్పాటు చేసిన ఈ పురస్కారాలను వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన తొమ్మిది మంది ప్రముఖులకు అందజేశారు. ఈ ఏడాది అవార్డులు పొందిన వారిలో ఐదుగురు మహిళలు ఉండటం విశేషం. ఈ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రామోజీ గ్రూప్ సీఎండీ సి.హెచ్. కిరణ్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. సమాజ నిర్మాణంలో నిస్వార్థంగా సేవలందిస్తున్న వ్యక్తులను గుర్తించి సత్కరించడం అభినందనీయమని ప్రముఖులు కొనియాడారు. రామోజీ ఎక్సలెన్స్ అవార్డు గ్రహీతలు: 1. కళలు, సాంస్కృతిక రంగం: వైకోం విజయలక్ష్మి 2. గ్రామీణాభివృద్ధి: పొదిలి రాజశేఖరరాజు 3. మహిళా సాధికారత: డాక్టర్ వి.రుక్మిణీరావు 4. జర్నలిజం: ఎం.సుచిత్ర 5. సైన్స్ అండ్ టెక్నాలజీ: డా.అర్జున్ అరుణాచలం 6. వైద్య-ఆరోగ్య పరిరక్షణ: డాక్టర్ జెమ్మా జె.ఎడాసెరీ 7. సామాజిక సేవ: దేవేంద్ర కుమార్ గుప్తా 8. విద్యా రంగం: మైత్రేయి జిచ్‌కర్ 9. యూత్ ఐకాన్: డా.గణేశ్ బరయ్యా సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తూ, తమ రంగాల్లో విశేష సేవలందించిన ఈ ప్రముఖులను అవార్డులతో ఘనంగా సత్కరించారు. రామోజీరావు ఆశయాలకు అనుగుణంగా సమాజ హితం కోసం నిరంతరం శ్రమిస్తున్న వ్యక్తులను ప్రోత్సహించడమే ఈ పురస్కారాల ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. పురస్కారాలు అందుకున్న విజేతలను సభలోని ప్రముఖులు, ఆహుతులు మనస్ఫూర్తిగా అభినందించారు.

ఘనంగా 'ప్రసన్న మెస్' ప్రారంభోత్సవం

-ముఖ్య అతిథిగా హాజరైన ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కమ్మరి పార్వతమ్మ

-రుచికరమైన, శుచికరమైన భోజనంతో ప్రజల ఆదరణ పొందాలని ఆకాంక్ష

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో నగరంలోని స్టేడియం రోడ్, సీబీఐ సర్కిల్‌లోని అమరావతి కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 'ప్రసన్న మెస్' ప్రారంభోత్సవ కార్యక్రమం సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. ?ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన



ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్‌పర్సన్, నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కమ్మరి పార్వతమ్మ జ్యోతి ప్రజ్వలన చేసి నూతన మెస్‌ను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం నిర్వాహకులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నేటి కాలంలో ప్రజలు ఆరోగ్యకరమైన, ఇంటి తరహా భోజనాన్ని కోరుకుంటున్నారని, అత్యుత్తమ నాణ్యతతో కూడిన రుచికరమైన, శుచికరమైన ఆహారాన్ని అందిస్తూ 'ప్రసన్న మెస్' వినియోగదారుల విశేష ఆదరణ పొందాలని ఆకాంక్షించారు. వ్యాపార రంగంలో మహిళలు రాణించడం అభినందనీయమని కొనియాడారు. ?పాల్గొన్న ప్రముఖులు: ఈ ప్రారంభోత్సవ వేడుకలో ప్రసన్న మెస్ ప్రొప్రైటర్ ప్రసన్న కుమారి, నవయుగ హోటల్ ప్రొప్రైటర్ అరుణ, 48వ వార్డు కార్పొరేటర్ ఎస్. రాఘవేంద్రతో పాటు స్థానిక ప్రముఖులు, శ్రేయోభిలాషులు, వినియోగదారులు పెద్ద ఎత్తున పాల్గొని నిర్వాహకులకు అభినందనలు తెలిపారు.

వైసీపీ నాయకుడు శివనాగిరెడ్డి కుటుంబంలో విషాదం.



పల్లె వెలుగు నంద్యాల రూరల్. నంద్యాల వైయస్సార్ నగర్‌లో వైసీపీ నాయకుడు శివనాగిరెడ్డి తండ్రి అకాల మరణం చెందడంతో వారి కుటుంబంలో విషాదం నెలకొంది.

విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి వారి నివాసానికి చేరుకుని, పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

స్టేజి వన్ అధికారుల నియామకం



బండి ఆత్మకూరు పల్లె వెలుగు నవంబర్ 16: బండి ఆత్మకూరు మండలంలో రెండో విడత జరగబోయే సాధారణ ఎన్నికలకు సంబంధించి స్టేజి వన్ అధికారులను నియమిస్తూ, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డిప్యూటీ ఎలక్షన్ అథారిటీ, ఆత్మకూరు ఆర్డీవో వెంకట శివ ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 18 నుండి 20 తేది వరకు నామినేషన్లకు సంబంధించి, తర్వాత 29న జరిగే గ్రామ పంచాయతీ సర్పంచుల ఎన్నికల వరకు స్టేజి వన్ అధికారులు పనిచేస్తారు. అధికారుల నియామకానికి గాను ఆయా మండలాల్లోని కళాశాల ప్రిన్సిపల్ లను లెక్చరర్లను పాఠశాల ప్రధానోపాధ్యాయులను స్టేజి వన్ (రిటర్నింగ్ అధికారులు) అధికారులుగా నియమించారు. బండి ఆత్మకూరు మండలంలోని 20 గ్రామాలను ఏడు క్లస్టర్లుగా విభజించారు. బండి ఆత్మకూర్ క్లస్టర్ పరిధిలో కాకునూరు ఎర్రగుంట్ల గ్రామాలకు అవుకు రవి, ఏ కోడూరు క్లస్టర్లో బికోడూరు, పార్నపల్లె గ్రామాలకు కె వెంకటేశ్వరరావు, ఈర్ణపాడు క్లస్టర్లో కడమల కాల్వ, వెంగళరెడ్డి పేట గ్రామాలకు అబుదుర్రాఫీ, నారాయణపురం క్లస్టర్లో చిన్నదేవులాపురం గ్రామాలకు డి మౌలాలి, సింగవరం క్లస్టర్ లో రామాపురం, సోమయాజుల పల్లె గ్రామాలకు వెంకటేశ్వరరావు, లింగాపురం క్లస్టర్ లో జి సి పాలెం గ్రామాలకు లెక్చరర్ రఘునాథరెడ్డిని నియమిస్తూ ఆర్డిఓ వెంకట శివ ఉత్తర్వులు జారీ చేశారు.

సర్పంచ్ పదవికి సై అంటున్న "భరతం"



బండి ఆత్మకూరు పల్లె వెలుగు నవంబర్ 16: బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న బి కోడూరు గ్రామంలో సర్పంచి పదవికి పోటీ చేసేందుకు తాను సిద్ధం అంటూ భరతం వెంకటరామయ్య ప్రకటించారు. రిజర్వేషన్లలో బి కోడూరు గ్రామపంచాయతీ జనరల్ కు కేటాయించారు. ఈ నేపథ్యంలో వెంకట్రామయ్య సర్పంచి గా పోటీ చేసేందుకు ఉత్సాహం కనబరుస్తున్నారు. వెంకటరామయ్య గతంలో బి కోడూరు గ్రామపంచాయతీ సర్పంచిగా పలుమార్లు పనిచేశారు. 2001వ సంవత్సరంలో గ్రామ పంచాయతీకి ఉప సర్పంచ్ గా పోటీ చేశారు. 2006లో సర్పంచ్ గా పోటీ చేసి 150 ఓట్ల తేడాతో ఓటమి చవిచూశారు. తిరిగి 2013లో జరిగిన పంచాయతీ ఎన్నికలలో 376 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 2021లో సర్పంచ్ గా పోటీ చేసి 275 ఓట్ల తేడాతో ఓటమిపాలయ్యారు. గ్రామ సర్పంచిగా పలుమార్లు పనిచేసే గ్రామాభివృద్ధి విషయంలో వెంకట్రామయ్య పాలుపంచుకున్నారు. తిరిగి ప్రస్తుతం జరగబోయే ఎన్నికలలో సర్పంచి పదవికి పోటీ చేసేందుకు సంసిద్ధులవుతున్నారు. ఈ మేరకు గ్రామంలో తనకు సంబంధించిన శ్రేయోభిలాషులు, రాజకీయ పార్టీలకు చెందిన నాయకులతో వారం రోజులుగా సమాలోచనలు జరుపుతున్నారు.

పోలీస్ జాగిలం జానీకి ఘన నివాళి.

● సుమారు 14 సంవత్సరాల పాటు పోలీస్ శాఖకు విశిష్ట సేవలు. ● 300కు పైగా వి వి ఐ పి కార్యక్రమాల్లో భద్రతా విధులు. ● జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్.

పల్లె వెలుగు నంద్యాల క్రైమ్. నంద్యాల జిల్లా





పోలీస్ శాఖకు చెందిన పోలీస్ జాగిలం జానీ మృతి చెందింది. సుమారు 14 సంవత్సరాల పాటు పోలీస్ శాఖలో విశిష్ట సేవలందించిన జానీ మృతి పట్ల జిల్లా పోలీస్ శాఖ తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. ఉమ్మడి కర్నూలు జిల్లా పోలీస్ శాఖలో విధులు నిర్వహించిన సమయంలో శ్రీశైలం, మంత్రాలయం, దేవరగట్టు, తిరుపతి తదితర ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో వివిధ సందర్భాల్లో నిర్వహించిన వి.ఐ.పి, వి వి ఐ పి బందోబస్తు కార్యక్రమాలలో జానీ తనదైన పాత్ర పోషించింది. భద్రతా పరంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా తన సేవలను సమర్థవంతంగా అందించింది.

లా బార్డర్ బ్రీడ్ కు చెందిన స్నిఫర్ జాగిలం జానీ, హ్యాండ్లర్ ఏ. స్వాములు ఆధ్వర్యంలో సుమారు 300 వి వి ఐ పి కార్యక్రమాల్లో విధులు నిర్వహించి పోలీస్ శాఖకు విశేష సేవలందించింది. నంద్యాల జిల్లా ఏర్పడిన అనంతరం జిల్లాకు కేటాయించబడిన జానీ, జిల్లా పోలీస్ శాఖలో నిరంతరం సేవలందిస్తూ వచ్చింది.

జానీ మృతి చెందిన సందర్భంగా నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, ఐపీఎస్ జానీకి ఘనంగా నివాళులర్పించారు. పోలీస్ శాఖకు జానీ అందించిన సేవలను స్మరించుకుంటూ, దాని విధి నిర్వహణ పట్ల ప్రశంసలు వ్యక్తం చేశారు.

జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీస్ లాంఛనాలతో జానీకి అంత్యక్రియల కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

పోలీస్ శాఖకు 14 సంవత్సరాల పాటు విశిష్ట సేవలందించిన జానీ సేవలు చిరస్మరణీయం. విధి నిర్వహణలో తనదైన ముద్ర వేసిన జానీకి నంద్యాల జిల్లా పోలీస్ శాఖ ఘన నివాళులర్పిస్తోంది.

ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎస్ ఖాదర్ భాషా , ఏ ఆర్ అడిషనల్ ఎస్పీ చిన్నికృష్ణ , స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి శ్రీనివాసరెడ్డి , ఏ ఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు , స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ మల్లికార్జున గుప్తా , ఆర్ ఐ లు బాబు , సురేష్ , ఆర్.ఎస్.ఐ లు కాళీ శ్రీ చరణ్ , హర్షవర్ధన్ రెడ్డి ,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు విడుదల ఎక్కడ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి .?

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. రాష్ట్రంలోని విద్యార్థులకు ఫీజు రీఎంబర్స్మెంట్ బకాయిలు అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యార్థులు ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు చెల్లించి ప్రతి ఏటా



అందక విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని దానికి కారణమైన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని బొమ్మలసత్రంలోని అంబెడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ టౌన్ అధ్యక్షులు శివకుమార్,ఉపాధ్యక్షులు మునాఫ్,వరుణ్ వారు మాట్లాడుతూ

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యార్థులకు ఇబ్బందులు పడకుండా చెల్లిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. కానీ అధికారం వచ్చి మూడు సంవత్సరాలు అవుతున్న విద్యార్థులకు ఎక్కడ కూడా పూర్తిస్థాయిలో అందకపోవడం సిగ్గుచేటని వారన్నారు. అనేక రోజులుగా రాష్ట్రంలోని డిగ్రీ, ఇంజనీరింగ్, తదితర విద్యార్థులకు వేలకోట్ల రూపాయలు బకాయిలు ఉన్న విద్యాశాఖ స్పందించకపోవడంపై ఆయా విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థులకు విద్యాసంస్థలు ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకుంటున్న కూడా విద్యాశాఖ మంత్రి నిద్రమత్తులో ఉండడం గమనార్హమని వారన్నారు. చిత్తూరు జిల్లాలోని ఎస్వీ సెట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఫీజులు కట్టమని యాజమాన్యం ఒత్తిడి తాగా ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థినీలు ఆత్మహత్యానికి ప్రయత్నించడం జరిగింది.అందులో ఒక విద్యార్థి ని మరణించడం జరిగింది. దీనికి కారణం కేవలం రాష్ట్ర ప్రభుత్వం ది వైఫల్యం పూర్తి గా కనిపిస్తుందని అర్థమవుతుందని వారన్నారు . ఈనాడు రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్న ఆత్మహత్యలు చేసుకుంటున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటని ఇప్పటికైనా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బకాయిలు వెంటనే విడుదల చేసి ఒత్తిడి చేసే విద్యాసంస్థలపై చర్యలు తీసుకొని. ఆత్మహత్యానికి పాల్పడిన విద్యార్థినీలకు ప్రభుత్వం అండగా నిలిచి ఆదుకోవాలని వారన్నారు వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ టౌన్ నాయకులు మహేష్,గౌడ్,సమీర్,మద్దిలేటి మరియు తదితరులు పాల్గొన్నారు.

అంధులకు అండగా బిసి రాజారెడ్డి ఔదార్యం

● హైదరాబాద్ లోని దేవనార్ అంధుల ఉచిత పాఠశాలకు 200 ప్యాకెట్ల నంద్యాల సోనా మసూరి పాత బియ్యం వితరణ ● కీ.శే. బిసి గుర్రెడ్డి , బిసి లక్ష్మమ్మ దంపతుల జ్ఞాపకార్థం

5 ఏళ్లుగా అనాధ ఆశ్రమాలు, అంధుల పాఠశాలకు బియ్యం ప్యాకెట్ల అందజేత ● ఈ ఏడాది రూ.9 లక్షలు విలువచేసే 50 కేజీలు గల 200 ప్యాకెట్ల నంద్యాల సోనా మసూరి పాత బియ్యం అందజేసిన బిసి రాజారెడ్డి

బనగానపల్లె ,నవంబర్ 16, పల్లెవెలుగు హైదరాబాద్ లోని దేవనార్ అంధుల ఉచిత పాఠశాలకు 200 ప్యాకెట్ల నంద్యాల సోనా మసూరి పాత బియ్యం అందజేసి బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి అందులకు అండగా నిలిచారు. తల్లిదండ్రులు కీ.శే. బిసి గుర్రెడ్డి , బిసి లక్ష్మమ్మ దంపతుల జ్ఞాపకార్థం బిసి రాజారెడ్డి గత 5 సంవత్సరములుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని వివిధ అనాధ ఆశ్రమాలకు బియ్యం ప్యాకెట్లు పంపిస్తూ రావడం జరిగింది. అందులో భాగంగా 6వ సంవత్సరం సోమవారం హైదరాబాదులో ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ పద్మశ్రీ సాయిబాబా గౌడ్ ఆధ్వర్యంలో నడుస్తున్న దేవనార్ అంధుల ఉచిత పాఠశాలకు 200 ప్యాకెట్ల నంద్యాల సోనా మసూరి పాత బియ్యం లారీ ద్వారా పంపడం





జరిగింది. రూ. 9 లక్షలు విలువచేసే 200 ప్యాకెట్ల నంద్యాల సోనా మసూరి పాత బియ్యం పంపించి అంధులకు అండగా నిలిచారు. ఈ సందర్భంగా బిసి రాజారెడ్డి మాట్లాడుతూ... పద్మశ్రీ డాక్టర్ ఏ.సాయిబాబా గౌడ్ గారు 33 ఏళ్ల క్రితం దేవనార్ అంధుల ఉచిత పాఠశాలను స్థాపించారన్నారు. భారతదేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పూర్తిస్థాయి అంధులను చేరదీసి వారికి 1వ తరగతి నుండి డిగ్రీ వరకు ఉచిత విద్యాబోధన చేస్తుండడం ఎంతో అభినందనీయం అన్నారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో 500 మంది విద్యార్థిని విద్యార్థులు విద్యాబోధన కొనసాగిస్తున్నారని, వారి అవసరాలకు అనుగుణంగా సైన్స్ లేబొరేటరీ, కంప్యూటర్ విద్య బోధిస్తున్నారన్నారు. కార్పొరేట్ స్థాయిలో వారికి విద్యాబుద్ధులు నేర్పిస్తుండడం, వసతి కల్పించడం అభినందనీయం అన్నారు. ఈ పాఠశాలలో చదివిన 87 మంది అంధులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి వివిధ ప్రాంతాల్లో పనిచేస్తుండడం గర్వకారణం అన్నారు. తాను స్వయంగా ఈ పాఠశాలను సందర్శించాక వారికి ఉపయోగపడే మంచి పని చేయాలనే సదుద్దేశంతో గత సంవత్సరం కూడా ఈ పాఠశాలకు 10 టన్నుల పాత బియ్యం అందజేసినట్లు తెలిపారు. అలాగే ఈ ఏడాది కూడా మరోసారి 200 ప్యాకెట్ల నంద్యాల సోనామసూరి పాత బియ్యం పంపించడం జరిగింది అన్నారు. కార్యక్రమంలో బిసి కుటుంబ అభిమానులు పాల్గొన్నారు.

89 ఏళ్లయినా అమలుకు నోచుకోని శ్రీబాగ్ ఒప్పందం.

☛"సాధించుకున్న ప్రాజెక్టులకు పంట కాలువల నిర్మాణం లేదు.. ఏర్పాటు చేసిన కార్యాలయాలకు సీమలో స్థిరత్వం లేదు."

☛ప్రభుత్వాలు మారినా రాయలసీమ దుస్థితి మారడం లేదు.

☛రాయలసీమ సాగునీటి సాధన సమితి.



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. 1937 నవంబర్ 16న కోస్తాంధ్ర, రాయలసీమ నాయకుల మధ్య కుదిరిన చారిత్రాత్మక శ్రీబాగ్ ఒప్పందానికి నేటితో 89 ఏళ్లు పూర్తయ్యాయి. ప్రాంతీయ సమతుల్యత, సమాన అభివృద్ధి, సాగునీటి వనరుల న్యాయమైన వినియోగం లక్ష్యంగా కుదిరిన ఈ ఒప్పందంలోని కీలక హామీలు తొమ్మిది దశాబ్దాలు గడిచినా పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోకపోవడం విచారకరమని రాయలసీమ సాగునీటి సాధన సమితి పేర్కొంది.

శ్రీబాగ్ ఒప్పంద దినోత్సవ సందర్భంగా సోమవారం నంద్యాల జిల్లా మహానంది దివ్యక్షేత్రంలో సమితి ఉపాధ్యక్షులు యర్రం శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో "రాయలసీమ హక్కుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విశ్రాంత ఆంధ్రాబ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ శివనాగిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

సభలో వక్తలు మాట్లాడుతూ రాయలసీమ, నెల్లూరు ప్రాంతాలను కోస్తాంధ్రతో సమాన అభివృద్ధి స్థాయికి తీసుకురావడానికి సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వాలని, కృష్ణా, తుంగభద్ర, పెన్నా నదీజలాల వినియోగంలో ఈ ప్రాంతాల అవసరాలకు న్యాయమైన ప్రాధాన్యత కల్పించాలని శ్రీబాగ్ ఒప్పందం స్పష్టం చేసిందని గుర్తుచేశారు.

అదేవిధంగా పాలన, అభివృద్ధికరణలో భాగంగా రాజధాని లేదా హైకోర్టును రాయలసీమలో ఏర్పాటు చేయాలని శ్రీబాగ్ ఒప్పందం స్పష్టం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అయితే 89 ఏళ్లు గడిచినా ఈ హామీలు ఆచరణకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

2014లో రాష్ట్ర విభజన జరిగిన అనంతరం కూడా రాయలసీమకు సమగ్ర అభివృద్ధి ప్రణాళిక అమలుకాలేదని విమర్శించారు. వికేంద్రీకరణ



ద్వారా ఈ ప్రాంతానికి లభించాల్సిన రాజధాని, హైకోర్టు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల అవకాశాలను నిర్వీర్యం చేయడమే కాకుండా, ఇప్పటికే ఏర్పాటు చేసిన కార్యాలయాలను సైతం అమరావతికి తరలించే ప్రక్రియ కొనసాగుతుండటం రాయలసీమ పట్ల వివక్షకు పరాకాష్ట అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

హంద్రీ-నీవా, గాలేరు-నగరి, తెలుగు గంగ, కేసీ కెనాల్ వంటి సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేయడంతో పాటు, ఇప్పటికే సాధించుకున్న ప్రాజెక్టుల ద్వారా చివరి ఆయకట్టుకు నీరందించే ప్రధాన కాలువలు, పంపిణీ వ్యవస్థలు, పంట కాలువల నిర్మాణంపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని డిమాండ్ చేశారు. రాయలసీమ వ్యవసాయానికి జీవనాధారమైన శ్రీశైలం జలాశయంలో బచావత్ ట్రిబ్యునల్ నిర్దేశించిన 854 అడుగుల కనీస నీటిమట్టాన్ని కాపాడేలా సమర్థవంతమైన నీటి నిర్వహణ విధానాన్ని అమలు చేయాలని కోరారు.

ప్రస్తుత ప్రభుత్వం ప్రకటిస్తున్న భారీ పెట్టుబడులు, అదనపు నీటి లభ్యత హామీలు కార్యరూపం దాల్చాలంటే ప్రాజెక్టుల వారీగా నిధుల కేటాయింపులు, పనుల పురోగతి, పూర్తిచేసే గడువులు, వాస్తవంగా సాగునీరు అందే ఆయకట్టు వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా, 2014 రాష్ట్ర విభజన అనంతరం రాయలసీమలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ కార్యాలయాలను అమరావతికి తరలించే చర్యలను తక్షణమే నిలిపివేయాలని, ఇప్పటికే తరలించిన కార్యాలయాలను తిరిగి రాయలసీమలోనే ఏర్పాటు చేసి యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. పాలన,



అభివృద్ధి వికేంద్రీకరణలో రాయలసీమకు సముచిత ప్రాధాన్యత కల్పించడంతో పాటు, సాగునీరు, పారిశ్రామికాభివృద్ధి, ఉపాధి, విద్య, వైద్య రంగాల్లో ప్రత్యేక అభివృద్ధి ప్రణాళిక అమలు చేసి ప్రాంతీయ అసమానతలను తొలగించాలని కోరారు.

శ్రీబాగ్ ఒప్పందం కేవలం చారిత్రక పత్రంగా మిగిలిపోకూడదని, దాని స్ఫూర్తితో రాయలసీమకు న్యాయమైన సాగునీటి హక్కులు, అన్ని రంగాల్లో సమాన అభివృద్ధి అవకాశాలు కల్పించాలని వక్తలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజకీయాలకు అతీతంగా రాయలసీమ ప్రజాప్రతినిధులు, రైతులు, ప్రజాసంఘాలు ఐక్యంగా ప్రాంత హక్కుల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

రాయలసీమకు కావాల్సింది సానుభూతి కాదు -- న్యాయమైన వాటా! ప్రకటనలు కాదు -- ఆచరణ! హామీలు కాదు -- హక్కుల అమలు! అని సభ ముక్తకంఠంతో డిమాండ్ చేసింది.

ఈ కార్యక్రమంలో ఏరువ రామచంద్రారెడ్డి, రాష్ట్ర ఆదర్శ రైతు సంపంగి వెంకటరమణ, ప్రొఫెసర్ నారపురెడ్డి, ప్రొఫెసర్ శివరామిరెడ్డి, నేపథ్య గాయకులు నారాయణగౌడ్, శివరామిరెడ్డి, కొమ్మా శ్రీహరి, యాగంటి బసవేశ్వర రైతుసంఘం నాయకులు ఎం.సి. కొండారెడ్డి, పట్నం రాముడు, కృష్ణమోహన్ రెడ్డి, గోస్పాడు మండల రైతు సంఘం నాయకులు బెక్కం చంద్రశేఖర్ రెడ్డి, చిన్న రామకృష్ణ, సుబ్బారెడ్డి, నిట్టూరు సుధాకర్ రావు, శిరిగిరి నాగేశ్వరరెడ్డి, సామాజిక కార్యకర్త రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేయాలి

గ్రామస్థాయికి కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పాలనను తీసుకెళ్లాలి -- మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి
కూటమి పార్టీల ముఖ్య నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించి దిశానిర్దేశం

బనగానపల్లె, నవంబర్ 16, పల్లెవెలుగు





పంచాయతీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గ్రామస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

కోయిలకుంట్ల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కోయిలకుంట్ల మండలానికి చెందిన ఎన్డీఏ కూటమి పార్టీల ముఖ్య నాయకులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. రానున్న పంచాయతీ ఎన్నికల సన్నద్ధత, అభ్యర్థుల ఎంపిక, పార్టీల మధ్య సమన్వయం, అనుసరించాల్సిన వ్యూహాలపై నాయకులతో చర్చించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజాదరణ కలిగి, ప్రజాసేవ పట్ల నిబద్ధతతో పాటు స్థానిక సమస్యలపై అవగాహన ఉన్న సమర్థులైన అభ్యర్థుల ఎంపికకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. అభ్యర్థుల ఎంపికలో అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని, కూటమి పార్టీల నాయకులందరి అభిప్రాయాలతో సమష్టి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల అమలే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని వివరించారు. ఈ ప్రభుత్వ ప్రగతి, ప్రజా సంక్షేమ లక్ష్యాలను ప్రతి గ్రామంలోని ప్రజలకు వివరించి, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా కూటమి శ్రేణులు నిలవాలని కోరారు.

ఎన్నికల నేపథ్యంలో కూటమి పార్టీల మధ్య ఎలాంటి విభేదాలకు తావులేకుండా ఐక్యతతో ముందుకు సాగాలని మంత్రి స్పష్టం చేశారు. ప్రతి గ్రామానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకొని, నాయకులు, కార్యకర్తలకు బాధ్యతలు అప్పగిస్తూ ఎన్నికల ప్రక్రియను సమర్థంగా నిర్వహించాలని సూచించారు.

వైసీపీకి మరోసారి ప్రజలు గుణపాఠం చెప్పాలి

గత ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత కూటమి ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పాలనకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గమనిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. రానున్న పంచాయతీ ఎన్నికల్లోనూ వైసీపీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కూటమి బలపరిచిన అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించి గ్రామాల అభివృద్ధికి ప్రజలు మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు.

పంచాయతీలు గ్రామీణ ప్రగతికి పునాదులని, ప్రజల అవసరాలను గుర్తించి వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేసే నాయకత్వం అవసరమని అన్నారు. అందుకు అనుగుణంగా ప్రజల నమ్మకాన్ని పొందిన అభ్యర్థులను గెలిపించుకునే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, పటిష్ట ప్రణాళికతో ఎన్నికల బరిలోకి దిగాలని కూటమి శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

ఈ సమావేశంలో ఎన్డీఏ కూటమి పార్టీల ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రంథాలయ పితామహుల సేవలు చిరస్మరణీయం..

పాణ్యం నవంబర్ 15 పల్లె వెలుగు : 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా



పాణ్యం మండల శాఖా గ్రంథాలయంలో సోమవారం గ్రంథాలయ ఉద్యమానికి విశేష కృషి చేసిన గ్రంథాలయ పితామహులు గాడిచర్ల హరిసర్వోత్తమరావు, అయ్యంకి వెంకట రమణయ్య, పాతూరి నాగభూషణం, ఎస్.ఆర్. రంగనాథం సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారిణి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. గ్రంథాలయాల స్థాపన కోసం మహనీయులు ఎన్నో పోరాటాలు చేసి, త్యాగాలు చేశారని, వారి కృషి ఫలితంగానే నేడు గ్రంథాలయాలు ప్రజలకు విజ్ఞానాన్ని అందిస్తున్నాయని తెలిపారు.వారి సేవలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో లక్ష్మీ గాయత్రి పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు అంజలి, షాహిన్, స్వర్ణ గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు. గ్రంథాలయ అధికారిణి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళులు

బండి ఆత్మకూరు పల్లె వెలుగు నవంబర్ 16: గ్రంథాలయల ఏర్పాటులో ఉద్యమాలు నిర్వహించిన ప్రముఖులకు నివాళులర్పించారు. 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా బండి ఆత్మకూరు గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి రవిరాజు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకట రమణయ్య



ఎస్ఆర్ రంగనాథన్ గాడిచర్ల హరి సర్వోత్తమరావుల చిత్రపటాలకు బండి ఆత్మకూరు డిప్యూటీ సర్వే తహసిల్దార్ శ్రీనివాసులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ అధికారి రవిరాజు మాట్లాడుతూ నాటి గ్రంథాలయ ఉద్యమకారుల కృషి త్యాగఫలం కారణంగా గ్రంథాలయాలు ఏర్పాటు అయ్యాయని పేర్కొన్నారు. విద్యార్థిని విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ రుక్సానా తో పాటు భవిష్య స్కూల్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.


గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళి

గడివేముల పల్లె వెలుగు దినపత్రిక గడివేముల శాఖ గ్రంథాలయం నందు 59వ జాతీయ



గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళి అర్పించడమైనది. గ్రంథాలయాధికారి వి. వెంకటేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో ఎంఈఓ సుబ్బరామిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని గ్రంథాలయ ఉద్యమకారులూ.= రంగనాథన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించడమైనది. ఎంఈఓ సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ ఉద్యమకారులైన అయ్యంకి వెంకటరమణయ్య, గాడి చర్ల హరి సర్వోత్తమరావు, గా.= రంగనాథన్ మీరు చేసిన సేవలు ఎంతగానో గొప్పవని నేటి గ్రంథాలయాలు వీరి ఉద్యమాలస్ఫూర్తితో ఏర్పడినవని తెలియజేశారు. గ్రంథాలయ అధికారి వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ ఉద్యమకారుల కృషి త్యాగ ఫలితమే నేటి గ్రంథాలయాలు కావున విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.అనంతరం ఎంఈఓ సుబ్బారాంరెడ్డి సార్ గారిని గ్రంథాలయ అధికారి వి. వెంకటేశ్వర రెడ్డి పూలమాలతో శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రవీంద్ర భారతి పాఠశాల యాజమాన్యం, పాఠశాల విద్యార్థిని విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

యాగంటి దేవస్థానానికి భక్తుల విరాళం



బనగానపల్లె , నవంబర్ 16, పల్లెవెలుగు మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రం యాగంటి శ్రీఉమామహేశ్వర స్వామి దేవస్థానానికి కొలిమిగుండ్ల గ్రామానికి చెందిన కామిశెట్టి మహేష్, ఆయన సతీమణి నాగజ్యోతి దేవస్థానమునకు రూ.10,116 లు విరాళం ఆలయ ఈఓ పాండురంగా రెడ్డి, చైర్మన్ బండి మౌలీశ్వర రెడ్డి లకు అందజేశారు. దాతకు ప్రత్యేక పూజలు జరిపించి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు



బనగానపల్లె, నవంబర్ 16, పల్లెవెలుగు పట్టణంలోని గ్రంథాలయంలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు సోమవారం పట్టణంలోని గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయాల వారోత్సవాల మూడవరోజు గ్రంథాలయ ఉద్యమకారులు పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకట రమణయ్య , గాడిచర్ల హరి సర్వోత్తరం రావు ల చిత్రపటాలకు గ్రంథాల అధికారి మధు శేఖర్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రిటైర్డ్ ఎంఈఓ శ్రీరాములు మాట్లాడుతూ అయ్యంకి వెంకటరమణయ్య తన జీవితమంతా గ్రంథాలయోద్యమానికి అంకితమై, ఎన్నో సేవలు చేసి, త్యాగాలు చేసి గ్రంథాలయాలను నిర్మించారన్నారు. వారి కృషి వల్లనే ఈరోజు గ్రంథాలయాల్లో పుస్తకాలు, గ్రంథాలు అందుబాటులో ఉండి ఎందరికో విద్యార్థులకు జ్ఞానార్జనానికి అవకాశం లభిస్తోందని తెలిపారు. గ్రంథాలయాలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి, పఠనాసక్తి పెంపుదిదీపుకు కీలకమైన వేదికలన్నారు. విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో సిబ్బంది అరుణ గీతామణి , ఉపాధ్యాయులు రామ గోవిందయ్య, పాఠకులు, బీ డీ సీ ఆ ర్గనేజర్లు పాల్గొన్నారు.

శ్రీ చౌడేశ్వరి దేవస్థానానికి భక్తుల విరాళం



బనగానపల్లె , నవంబర్ 16, పల్లెవెలుగు మండలంలోని నందవరంశ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానానికి అనంతపురం పట్టణానికి చెందిన ఉడుముల దేవేంద్రప్రసాద్ ఆయన సతీమణి ఉమా కాంతా దేవి, వారి కుటుంబ సభ్యులు ఆలయ అభివృద్ధి కొరకు 25,000/- రూ" చందాను ఆలయ డెవలప్ మెంట్ కమిటీ చైర్మన్ పి.వి.కుమార్ రెడ్డి ,ఆలయ కమిటీ చైర్మన్ పి.వి. నాగార్జున రెడ్డి ల సమక్షంలో ఆలయ అర్చకులకు సోమవారం అందచేశారు.

టీడీపీ నాయకుడు మృతి నివాళులు అర్పించిన బీసీ ఇందిరా రెడ్డి



బనగానపల్లె,నవంబర్ 16,పల్లెవెలుగు అవుకు మండలం రామాపురం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు మారం మధుసూదన్ రెడ్డి అనారోగ్యంతో మృతి చెందడం పట్ల బీసీ ఇందిరా రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మధుసూదన్ రెడ్డి మృతి చెందిన విషయం తెలుసుకున్న బీసీ ఇందిరా రెడ్డి గారు రామాపురంలోని వారి స్వగృహానికి చేరుకుని పార్థివ దేహంపై పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులకు ధైర్యంగా ఉండాలని, వారికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.

యాగంటిలో మాజీ ఎమ్మెల్యే కాటసాని
దంపతుల ప్రత్యేక పూజలు



బనగానపల్లె , నవంబర్ 16, పల్లెవెలుగు మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రం యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానంలో

కార్తీక మాసం తొలి సోమవారం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ఆయన సతీమణి కాటసాని జయమ్మ లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానానికి వచ్చిన మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దంపతులకు ఆలయ పూజారులు సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు అనంతరం కాటసాని రామిరెడ్డి దంపతులు ఉమామహేశ్వరులకు నందీశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాటసాని దంపతులకు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో యాగంటి దేవస్థానం మాజీ చైర్మన్ తోట బుచ్చిరెడ్డి,మనోహర్ రెడ్డి, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

రెండవ రోజు సర్పంచ్ వార్డు పోటీలకు 320 నామినేషన్లు.



రుద్రవరం. పల్లె వెలుగు : రుద్రవరం మండలంలో ఈ నెల 26న జరగనున్న సర్పంచ్ వార్డు మెంబర్ల పోటీకి రెండవ రోజు 320 నామినేషన్లు స్వీకరించినట్లు ఎంపీడీవో భాగ్యలక్ష్మి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ రెండవ రోజు7 నామినేషన్ ల స్వీకరణ కేంద్రాలలో నామినేషన్ల స్వీకరణ సందర్భంగా సర్పంచ్ అభ్యర్థుల పోటీకి 75 వార్డు నెంబర్ల అభ్యర్థుల పోటీకి 245 నామినేషన్లు స్వీకరించినట్లు ఎంపీడీవో తెలిపారు.

గ్రామపంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

బనగానపల్లె, నవంబర్ 16, పల్లెవెలుగు



బనగానపల్లె మండలంలో గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ విడుదలైనట్లు ఎంపీడీవో నాగరాజు సోమవారం తెలిపారు. రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల అధికారి ప్రకటించిన షెడ్యూల్ మేరకు ఎన్నికల ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఈ నెల 18న రిటర్నింగ్ అధికారులు ఎన్నికల నోటీసులు జారీ చేయనున్నారు. అదే రోజు నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుందని తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామని తెలిపారు. నామినేషన్ల దాఖలుకు ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు గడువు ఉందని తెలిపారు. ఈ నెల 21న ఉదయం 8 గంటల నుంచి నామినేషన్ల పరిశీలన, 22న తిరస్కరించిన నామినేషన్లపై అప్పిలు, 23న అప్పిలికు వెళ్లిన నామినేషన్ల పరిశీలన , నెల 24న మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని తెలిపారు. 24 వ తేదీ మధ్యాహ్నం తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తామని తెలిపారు.ఈ నెల 29న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి, లెక్కింపు పూర్తయిన వెంటనే ఫలితాలను ప్రకటిస్తామని ఎంపీడీవో తెలిపారు. ఫలితాల ప్రకటన అనంతరం ఉపసర్పంచ్ ఎన్నిక నిర్వహిస్తామని, ఏదైనా కారణంతో ఆ రోజు ఉపసర్పంచ్ ఎన్నిక జరగకపోతే మరుసటి రోజు నిర్వహించనున్నట్లు తెలిపారు.

రామదుర్గం వైసీపీ సర్పంచ్ అభ్యర్థిగా కొండ్ల కృష్ణ నామినేషన్.

-ఒక్కసారి అవకాశం ఇవ్వండి.. రామదుర్గం రూపురేఖలు మార్చి చూపిస్తా.

-రైతు బిడ్డగా బరిలోకి.. గ్రామ సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యం.

ఆదోని (పల్లె వెలుగు): ఆలూరు నియోజకవర్గంలోని చిప్పగిరి మండలం రామదుర్గం గ్రామ వైసీపీ సర్పంచ్ అభ్యర్థిగా కొండ్ల కృష్ణ సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు ఒక్కసారి అవకాశం ఇచ్చి సర్పంచ్‌గా గెలిపిస్తే రామదుర్గం గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని తెలిపారు.

"మీ ఓటుతో మార్పు తీసుకురండి.. రామదుర్గం రూపురేఖలు మారుస్తా" అని కొండ్ల కృష్ణ అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని, ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నిజాయితీగా ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు.

రాబోయే రోజుల్లో ఎన్నికల ప్రచారంలో తాను ఇచ్చే ప్రతి హామీని కచ్చితంగా నెరవేర్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. మార్పు వస్తేనే గ్రామ అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు.

తాను రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తిని కాదని, ఉన్నత స్థాయి కుటుంబ నేపథ్యం కూడా లేదని, ఒక సాధారణ రైతు బిడ్డగా సర్పంచ్ అభ్యర్థిగా ప్రజల ముందుకు వచ్చానని కొండ్ల కృష్ణ తెలిపారు. రైతుల కష్టాలు తనకు తెలుసని, అదే విధంగా గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు కూడా తనకు తెలుసని చెప్పారు. గ్రామ సమస్యలను దగ్గరగా తెలుసుకుని దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం

రామదుర్గం గ్రామంలో తాగునీరు, డ్రైనేజీ, వీధి దీపాలు తదితర సమస్యలు ఉన్నాయని ఆయన తెలిపారు. ముఖ్యంగా గ్రామం నుంచి ప్రధాన రహదారి వరకు ఉన్న సుమారు రెండున్నర కిలోమీటర్ల రహదారి అధ్వానంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

రామదుర్గం నుంచి ప్రతిరోజూ అనేకమంది విద్యార్థులు చదువుల కోసం, గ్రామ ప్రజలు నిత్యావసరాల కోసం ఆదోని, ఆలూరు, గుంతకల్లు పట్టణాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. అలాగే వైద్య అవసరాల కోసం కర్నూలు, అనంతపురం వంటి నగరాలకు వెళ్లే ప్రజలకు రహదారి అధ్వానంగా ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ సమస్యలన్నింటినీ ప్రజల దృష్టిలో పెట్టుకుని తనకు ఓటు వేసి గెలిపించాలని కొండ్ల కృష్ణ కోరారు. గ్రామంలో ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే వాటిని కూడా ప్రాధాన్యత క్రమంలో గుర్తించి దశలవారీగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు తనకు మద్దతుగా నిలిచి ఓటు వేసి, వేయించి గెలిపించాలని ఆయన కోరారు.



నెట్టేకల్ టీడీపీ సర్పంచ్ అభ్యర్థిగా జయలక్ష్మి నామినేషన్.

-ఒక్కసారి అవకాశం ఇవ్వండి.. గ్రామాన్ని అభివృద్ధి చేసి చూపిస్తా.

-తాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాల సమస్యల పరిష్కారమే లక్ష్యం.

ఆదోని (పల్లె వెలుగు): ఆదోని నియోజకవర్గంలోని



నెట్టేకల్ గ్రామ టీడీపీ సర్పంచ్ అభ్యర్థిగా జయలక్ష్మి సోమవారం కూటమి ప్రభుత్వ నాయకులు, కార్యకర్తల మధ్య అంగరంగ వైభవంగా నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనను ఒక్కసారి సర్పంచ్‌గా గెలిపిస్తే గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. గ్రామంలో ప్రధానంగా ఉన్న తాగునీటి సమస్య, సీసీ రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు తదితర సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని జయలక్ష్మి తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించి నెట్టేకల్ గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే తన లక్ష్యమన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామంలో ఇప్పటికే పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఆమె వివరించారు. సుమారు రూ.4 లక్షలతో అంగన్వాడీ కేంద్రానికి మరమ్మతులు, రూ.30 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం, రూ.10 లక్షలతో తాగునీటి కొళాయిలు, పైపులైన్ పనులు చేపట్టినట్లు తెలిపారు. అయితే గ్రామంలో ఇంకా అనేక సమస్యలు పరిష్కారం కావాల్సి ఉందని, ప్రజలు తనకు ఒక్కసారి అవకాశం ఇచ్చి సర్పంచ్‌గా గెలిపిస్తే మిగిలిన సమస్యలను కూడా ప్రాధాన్యత క్రమంలో



పరిష్కరిస్తానని జయలక్ష్మి పేర్కొన్నారు.

"అభివృద్ధి జరగాలంటే మార్పు రావాలి.. మార్పు వస్తేనే మన గ్రామం అభివృద్ధి చెందుతుంది. అందుకే ప్రతి ఒక్కరూ టీడీపీకి ఓటు వేసి నన్ను గెలిపించాలి" అని ఆమె గ్రామ ప్రజలను కోరారు.

గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

-పోటీ చేసే అభ్యర్థులకు పోలీసులు భరోసా కల్పించాలి -- పోతిరెడ్డి నాగార్జున రెడ్డి

పోరుమామిళ్ల నవంబర్ 16 (పల్లె వెలుగు):బద్వేల్ నియోజకవర్గంలో గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ ప్రక్రియను గత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలతో పోలిస్తే పోలీసులు సజావుగా నిర్వహిస్తుండటంపై మాజీ పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులపై ఎలాంటి ఒత్తిళ్లు లేకుండా, వారు నిర్భయంగా నామినేషన్లు దాఖలు చేసుకునేలా, ప్రచారం నిర్వహించుకునేలా పోలీసు అధికారులు భరోసా కల్పించాలని కోరారు. గత ఎన్నికల్లో మాదిరిగా అభ్యర్థులను పోలీస్ స్టేషన్లకు పిలిపించి బెదిరించడం, భయపెట్టడం వంటి చర్యలకు పాల్పడకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు.

పార్టీలకు అతీతంగా జరిగే ఈ ఎన్నికల్లో ప్రతి ఓటరు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాల్సిన బాధ్యత పోలీసు వ్యవస్థపై ఉందన్నారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి ఆటంకాలు ఉండవని, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహిస్తామని జిల్లా ఎస్పీ హామీ ఇచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎవరూ భయపడకుండా నిర్భయంగా ప్రచారం చేసుకోవాలని కోరారు. ఎవరైనా పోలీసు అధికారులు అభ్యర్థులపై నామినేషన్లు ఉపసంహరించుకోవాలని బలవంతం చేసినా, ఒత్తిడి తెచ్చినా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అలాంటి ఘటనలపై పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు సక్రమంగా, నిష్పక్షపాతంగా జరిగితే గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొంటుందని, లేనిపక్షంలో అనవసర ఘర్షణలు, కక్షలకు దారితీసే అవకాశం ఉందని పోతిరెడ్డి నాగార్జున రెడ్డి అభిప్రాయపడ్డారు.



89 ఏళ్లైనా అమలుకు నోచుకోని శ్రీబాగ్ ఒప్పందం

-ప్రభుత్వాలు మారినా.. రాయలసీమ దుస్థితి మారడం లేదు

-రాయలసీమ సాగునీటి సాధన సమితి

మహానంది, పల్లె వెలుగు శ్రీబాగ్ ఒప్పందానికి



నేటితో 89 ఏళ్లు పూర్తయిన కీలక హామీలు పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోకపోవడం విచారకరమని రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మహానంది రెడ్డి భవనంలో రాయలసీమ హక్కుల దినోత్సవం ఉపాధ్యక్షులు యర్రం శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ..రాయలసీమ, నెల్లూరు ప్రాంతాలను కోస్తాంధ్రతో సమాన అభివృద్ధి స్థాయికి తీసుకురావడానికి సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వాలని, కృష్ణా, తుంగభద్ర, పెన్నా నదీజలాల వినియోగంలో ఈ ప్రాంతాల అవసరాలకు న్యాయమైన ప్రాధాన్యత కల్పించాలని శ్రీబాగ్ ఒప్పందం స్పష్టం చేసిందని గుర్తుచేశారు. అదేవిధంగా పాలన, అభివృద్ధికరణలో భాగంగా రాజధాని లేదా హైకోర్టును రాయలసీమలో ఏర్పాటు చేయాలని శ్రీబాగ్ ఒప్పందం స్పష్టం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అయితే 89 ఏళ్లు గడిచినా ఈ హామీలు ఆచరణకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.శ్రీబాగ్ ఒప్పందం కేవలం చారిత్రక పత్రంగా మిగిలిపోకూడదని, దాని స్ఫూర్తితో రాయలసీమకు న్యాయమైన సాగునీటి హక్కులు, అన్ని రంగాల్లో సమాన అభివృద్ధి అవకాశాలు కల్పించాలని వక్తలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజకీయాలకు అతీతంగా రాయలసీమ ప్రజాప్రతినిధులు, రైతులు, ప్రజాసంఘాలు ఐక్యంగా ప్రాంత హక్కుల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో విశ్రాంత ఆంధ్రాబ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ శివనాగిరెడ్డి,ఏరువ రామచంద్రారెడ్డి, రాష్ట్ర ఆదర్శ రైతు సంపంగి వెంకటరమణ, ప్రొఫెసర్ నారపురెడ్డి, ప్రొఫెసర్ శివరామిరెడ్డి, నేపథ్య గాయకులు నారాయణగౌడ్, శివరామిరెడ్డి, కొమ్మా శ్రీహరి, యాగంటి బసవేశ్వర రైతుసంఘం నాయకులు కొండారెడ్డి, పట్నం రాముడు, కృష్ణమోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చాగి టీడీపీ సర్పంచ్ అభ్యర్థిగా రాము నామినేషన్.

-ఒక్కసారి అవకాశం ఇవ్వండి.. గ్రామాన్ని అభివృద్ధి చేసి చూపిస్తా.

-తాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాల సమస్యల పరిష్కారమే లక్ష్యం.

ఆదోని (పల్లె వెలుగు): ఆదోని నియోజకవర్గంలోని



చాగి గ్రామ టీడీపీ సర్పంచ్ అభ్యర్థిగా రాము సోమవారం కూటమి ప్రభుత్వ నాయకులు, కార్యకర్తల మధ్య అంగరంగ వైభవంగా నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను ఒక్కసారి సర్పంచ్‌గా గెలిపిస్తే గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. గ్రామంలో ప్రధానంగా ఉన్న తాగునీటి సమస్య, సీసీ రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు తదితర సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని జయలక్ష్మి తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించి నెట్టేకల్ గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే తన లక్ష్యమన్నారు.

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామంలో ఇప్పటికే పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఆమె వివరించారు. సుమారు, రూ.30 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం, చేపట్టినట్లు తెలిపారు.

అయితే గ్రామంలో ఇంకా అనేక సమస్యలు పరిష్కారం కావాల్సి ఉందని, ప్రజలు తనకు ఒక్కసారి అవకాశం ఇచ్చి సర్పంచ్‌గా గెలిపిస్తే మిగిలిన సమస్యలను కూడా ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తానని జయలక్ష్మి పేర్కొన్నారు.

“అభివృద్ధి జరగాలంటే మార్పు రావాలి.. మార్పు వస్తేనే మన గ్రామం అభివృద్ధి చెందుతుంది. అందుకే ప్రతి ఒక్కరూ టీడీపీకి ఓటు వేసి నన్ను గెలిపించాలి” అని గ్రామ ప్రజలను కోరారు.

భారీ జన సమీకరణతో నామినేషన్ వేసిన కాకర్ల రమేష్ చౌదరి

మద్దతు తెలిపినజిల్లా బిజెపి అధ్యక్షుడు అభిరుచి మధు

దొర్నిపాడు నవంబర్ 16 పల్లె వెలుగు న్యూస్



దొర్నిపాడుమండలంలోని బురారెడ్డి పల్లె గ్రామ సర్పంచ్ అభ్యర్థిగాభారీ జన సమీకరణతో సోమవారంకాకర్ల రమేష్ చౌదరి భార్య కాకర్ల యువరేఖ తరపున నామినేషన్ దాఖలు చేశారు సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కాకర్ల యువరేఖకు జిల్లా బిజెపి అధ్యక్షుడు అభిరుచి మధు తన సంపూర్ణ మద్దతు తెలియజేసి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు,ఈ సందర్భంగా జిల్లాబిజెపిఅధ్యక్షుడుఅభిరుచిమధుమాట్లాడుతూ యువరేఖ గెలుపుకుతనవంతుకృషిచేస్తాననిఆయన అన్నారు,గ్రామ ప్రజలు ఓటర్లుయువరేఖనుఆశీర్వదించిసర్పంచిగగెలిపించాలని ఆయన ఓటర్లను, ప్రజలను కోరారు అనంతరం సీనియర్ టిడిపి నాయకుడు యువ న్యాయవాది అయిన కాకర్ల రమేష్ చౌదరి మాట్లాడుతూ క్రీడల కు యువతను ప్రోత్సహించడము వారికి అవసరమైన సామాగ్రిని అందజేయడంతో పాటు గ్రామాల్లో జరిగే పండుగ వేడుకలకు ,నూతన దేవాలయ నిర్మాణాల కొరకు అదేవిధంగా శుభకార్యాలకు తన వంతు సహాయసహకారంఅందిస్తు ప్రజా సేవ, గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్న అన్నారు, గ్రామంలో తాగునీటి సమస్య ఉండడంతో తానా అధ్యక్షునితో మాట్లాడి సమస్య పరిష్కారానికి తనువంతు కృషి చేశానన్నారు ప్రజా సేవ చేయడానికి గ్రామ అభివృద్ధి చెందడానికి మా కుటుంబానికి ఒక అవకాశం

ఇవ్వాలనిఓటర్లుఅభ్యర్థిస్తున్నానుఅన్నారు,ఈకార్యక్ర మంలోసీనియర్ టిడిపి నాయకుడు మల్లేష్ చౌదరి భాస్కర్ చౌదరి, బురారెడ్డి పల్లె గ్రామ ఉపసర్పంచ్ గుండ్రాతి చాకలివెంకటసుబ్బయ్య, కాకర్ల శ్రీనివాస్ చౌదరి టిడిపి నాయకులు కార్యకర్తలు ప్రజలు అభిమానులు పాల్గొన్నారు

జిల్లా పరిషత్ చైర్మన్, వైస్ చైర్మన్,

కో-ఆప్షన్ సభ్యుల ఎన్నికకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి.

-ఈ నెల 20న ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలి.

-జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ఈ నెల 20న



నిర్వహించనున్న జిల్లా పరిషత్ చైర్మన్, వైస్ చైర్మన్, కో-ఆప్షన్ సభ్యుల ఎన్నికకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం నంద్యాల పట్టణంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణకు చేపట్టాల్సిన ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు.

ఎన్నికల ప్రక్రియ సజావుగా, ప్రశాంతంగా జరిగేలా వేదిక (డయాస్), సమావేశ మందిరంలో టేబుళ్ల ఏర్పాటు, సభ్యుల సీటింగ్, సంబంధిత అధికారుల స్థానాలు తదితర అంశాలపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. చైర్మన్, వైస్ చైర్మన్, కో-ఆప్షన్ సభ్యుల ఎన్నికకు సంబంధించి మొత్తం మూడు పదవుల భర్తీకి అవసరమైన ఏర్పాట్లను ఎన్నికల నిబంధనల ప్రకారం సమన్వయంతో పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ పరిశీలనలో జిల్లా పరిషత్ సీఈఓ శివశంకర్, పంచాయతీరాజ్ ఎస్ఈ నాగరాజు, ఎంపీడీఓ సుగుణ తదితరులు పాల్గొన్నారు.



పోరుమామిళ్ల మేజర్ పంచాయతీ

జనసేన సర్పంచ్ అభ్యర్థిగా జోడు సావిత్రమ్మ నామినేషన్

పోరుమామిళ్ల, నవంబర్ 16: (పల్లె వెలుగు): బద్వేల్ నియోజకవర్గంలోని పోరుమామిళ్ల మేజర్ గ్రామపంచాయతీ జనసేన పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా జోడు తిరుపతయ్య సతీమణి



జోడు సావిత్రమ్మను పార్టీ ప్రకటించింది. పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకు గ్రామ నాయకులు, కార్యకర్తల ఏకాభిప్రాయంతో ఆమె అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారు. దీంతో జనసేన పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.ఈ నేపథ్యంలో కడప పార్లమెంట్ నిర్వాహక దళ్ సభ్యుడు మరియు, పోరుమామిళ్ల-1 ఎంపీటీసీ శీలం శెట్టి లక్ష్మయ్య ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. జోడు సావిత్రమ్మ నాయకులు, కార్యకర్తలతో కలిసి పోరుమామిళ్లలోని వెంకటేశ్వర స్వామి ఆలయం సమీపం నుంచి పంచాయతీ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జోడు సావిత్రమ్మకు మద్దతు తెలిపారు.

భక్తులకు అన్ని సౌకర్యాలు: చైర్మన్



మహానంది, పల్లె వెలుగు

మహానంది క్షేత్రంలో కార్తీక మాసం సందర్భంగా వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని చైర్మన్ నరాల చంద్రమౌళీశ్వర రెడ్డి పేర్కొన్నారు. క్షేత్రంలో మొదటి సోమవారం కావడంతో స్వామి అమ్మవార్ల దర్శనార్థం భక్తులు పోటెత్తారు. క్షేత్రంలో భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు, దర్శన ఏర్పాట్లపై భక్తులను అడిగి తెలుసుకున్నారు. భక్తుల సౌకర్యాల కల్పనే ధ్యేయంగా ఏర్పాట్లు చేశామన్నారు. ఎటువంటి అసౌకర్యాలు కలిగిన తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు.

రెండో విడత పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్.



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల జిల్లాలో రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. జిల్లాలోని బనగానపల్లి, కొలిమిగుండ్ల, కోవెలకుంట్ల, సంజామల, అవుకు, వెలుగోడు, మహానంది, ఆత్మకూరు, బండి ఆత్మకూరు, పాణ్యం, గడివేముల మండలాల్లోని 195 గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మొత్తం 1,982 వార్డులకు 2,108 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 18 నుంచి 20 వరకు నామినేషన్ల స్వీకరణ, 21న పరిశీలన, 22న అప్పీళ్లు, 23న అప్పీళ్ల పరిష్కారం చేపడతారు. 24న మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుంది. నవంబరు 29న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించి, అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటిస్తారు. అవసరమైన చోట నవంబరు 30న రీపోలింగ్ నిర్వహిస్తారు. ఎన్నికలను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేసి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

విభిన్న ప్రతిభకు క్రీడా ప్రోత్సాహం.

మూడు శాతం క్రీడా కోటాను సద్వినియోగం చేసుకోవాలి: డాక్టర్ రవి కృష్ణ.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని



పురస్కరించుకుని నంద్యాల జిల్లా క్రీడా ప్రాంగణంలో సోమవారం జిల్లా స్థాయి పారా క్రీడా పోటీలను నిర్వహించారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ, జిల్లా పారా క్రీడా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో దివ్యాంగ బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ ఆదేశాల మేరకు ఆరు క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంపికైన వారు నవంబర్ 30 నుంచి డిసెంబర్ 2 వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో నంద్యాల జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు.

ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా పారా క్రీడా సంఘం అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ దివ్యాంగ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకోవాలని సూచించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మూడు శాతం క్రీడా కోటా ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దివ్యాంగుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పారా క్రీడా సంఘం కార్యదర్శి, పోటీల కన్వీనర్ రమణయ్య, జిల్లా కో-ఆర్డినేటర్ ప్రసన్న, సమగ్ర శిక్ష అభియాన్ అధికారులు జగన్ మోహన్ రెడ్డి, సాంకేతిక కమిటీ సభ్యులు శ్రీహరి, దస్తగిరి, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎం.ఎస్.వి. రాజు తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ క్షేత్రస్థాయి తనిఖీలు.

బొమ్మల సత్రంలో మస్టర్ విజిట్.. పలు కాలనీల్లో పర్యటన.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల పట్టణంలో మున్సిపల్ కమిషనర్ క్షేత్రస్థాయిలో పర్యటించి మున్సిపల్ కార్యకలాపాలను పరిశీలించారు. తొలుత బొమ్మల సత్రం ప్రాంతంలో మస్టర్ విజిట్ నిర్వహించి సిబ్బంది విధుల నిర్వహణను పరిశీలించారు. అనంతరం పట్టణంలోని పలు కాలనీల్లో పర్యటించి క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షించారు.



ఈ సందర్భంగా కాలనీల్లో పారిశుద్ధ్య నిర్వహణ, మున్సిపల్ సేవలు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించడంతో పాటు పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించేందుకు ఈ పర్యటన చేపట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్లు విక్రమ్, శభరిష్, శానిటేషన్ సూపర్వైజర్లు మురళీధర్, లక్ష్మీనారాయణ, శివప్రసాద్ రెడ్డితో పాటు మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్లార్తి సర్పంచ్ ఎన్నికల బరిలో ఎం. ఫకృమ్మ..

నామినేషన్‌తో ప్రచారానికి శ్రీకారం!



హోళగుంద పల్లె వెలుగు నవంబర్:16 గ్రామ పంచాయతీ ఎన్నికల వేడి మొదలైంది. ఈ నేపథ్యంలో ఎల్లార్తి గ్రామ సర్పంచ్ పదవికి అభ్యర్థిగా శ్రీమతి ఎం. ఫకృమ్మ సోమవారం తన నామినేషన్‌ను దాఖలు చేశారు. నామినేషన్ కేంద్రానికి చేరుకున్న ఆమె ఎన్నికల అధికారులకు అవసరమైన పత్రాలను సమర్పించి నామినేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆమె కుమారుడు ఎం. మహబూబ్ బాషా, కుటుంబ సభ్యులు, అభిమానులు, మద్దతుదారులు పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని, గ్రామ ప్రజల ఆదరాభిమానాలతో సర్పంచ్‌గా ఎన్నికై గ్రామ ప్రగతికి కృషి చేస్తానని ఎం. ఫకృమ్మ పేర్కొన్నారు. ఎం. ఫకృమ్మ నామినేషన్ దాఖలుతో ఎల్లార్తి గ్రామంలో సర్పంచ్ ఎన్నికల సందడి నెలకొంది.

జాయ్ ఆఫ్ గివింగ్ లో భాగంగా నంద్యాల గుడ్ షెఫర్డ్ పాఠశాల సహకారం తో దుస్తుల పంపిణీ.

రుద్రవరం. పల్లె వెలుగు : మండల కేంద్రం రుద్రవరంలో జాయ్ ఆఫ్ గివింగ్ కార్యక్రమంలో భాగంగా చిల్డ్రన్స్ డే ను పురస్కరించుకొని పేద విద్యార్థులకు దుస్తులు పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. నంద్యాల గుడ్ షెఫర్డ్ పాఠశాల ప్రిన్సిపల్ జెస్సి పాల్ ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నట్లు ఆర్ నాగులవరం ప్రాథమిక పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు సుదర్శన్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ జాయ్ ఆఫ్ గివింగ్ కార్యక్రమంలో భాగంగా నంద్యాల గుడ్ షెఫర్డ్ పాఠశాల వారి సహకారంతో పాఠశాల ప్రిన్సిపాల్ జెస్సి పాల్ ఎంతో సహృదయంతో విద్యార్థులను ప్రోత్సహించి వారిచే సేకరించి పంపిన దుస్తులను చిల్డ్రన్స్ డే సందర్భంగా మండలంలోని వివిధ గ్రామీణ ప్రాంతాలలోనీ పేద విద్యార్థులకు పంపిణీ చేయడానికి సిద్ధం చేశామని తెలిపారు. దాదాపు 15 సంవత్సరాల పైబడి ఈ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. గుడ్ షెఫర్డ్ విద్యా సంస్థ ద్వారా వారు పంపించిన దుస్తులు మండలంలోని హై స్కూల్స్, కేజీబీవీ స్కూళ్లలో 2000 పైబడి పేద విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ విధంగా ప్రతి సంవత్సరం సహాయ సహకారాలు అందిస్తున్న గుడ్ షెఫర్డ్ పాఠశాల యాజమాన్యం వారికి, సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులకు, మరియు పాఠశాల సిబ్బందికి మీడియా ముఖంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



అక్రమ మద్యం నాటు సారా అరికట్టేందుకు విస్తృత తనిఖీలు... ఎక్సైజ్ సిఐ విజయ్ కుమార్.

రుద్రవరం. పల్లె వెలుగు : రాబోయే సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యం, నాటుసారా సరఫరాను అరికట్టేందుకు ఆళ్లగడ్డ ఎక్సైజ్ సీఐ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. సోమవారం హరినగరం గ్రామంలో సిఐ విజయ్ కుమార్ మాట్లాడుతూ ఒకప్పుడు నాటుసారాకు కేంద్రంగా ఉన్న హరి నగరం, తాండ, బాలస్వామి బాయి తాండ, అహోబిలం తదితర ప్రాంతాల్లో ఆళ్లగడ్డ, కోయిలకుంట్ల, బనగానపల్లె, నంద్యాల ఎక్సైజ్ స్టేషన్ల సిబ్బంది, నంద్యాల డీటీఎఫ్ బృందంతో కలిసి సంయుక్తంగా క్లస్టర్ రైడ్స్ నిర్వహించగా, ఎలాంటి అక్రమ మద్యం పట్టుబడలేదని సీఐ స్పష్టం చేశారు. ముందస్తు చర్యల్లో భాగంగా పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా ఉంచి వారికి కౌన్సిలింగ్ ఇస్తున్నామని, ఇందులో భాగంగానే ఈరోజు ఆళ్లగడ్డ మరియు రుద్రవరం మండలం పరిధిలో సారా కేసుల్లో ఉన్న 10 మంది పాత నేరస్తులను తహసీల్దార్ (ఎంఆర్ఓ) ఎదుట బైండోవర్ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



తండ్రి ఆశయ సాధన కోసం రాజకీయ అరంగేట్రం

నాగలకుంట్ల(సంచర్ల) సర్పంచ్ అభ్యర్థిగా ముత్యాల లక్ష్మీదేవి నామినేషన్

పోరుమామిళ్ల, నవంబర్ 16 (పల్లె వెలుగు):తండ్రి ఆశయాలను నెరవేర్చడంతో పాటు గ్రామ అభివృద్ధే లక్ష్యంగా రాజకీయాల్లోకి అడుగుపెట్టిన ముత్యాల లక్ష్మీదేవి సోమవారం నాగలకుంట్ల (సంచర్ల) గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా నాలుగు గ్రామాలకు చెందిన ప్రజలు, యువత, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆమెకు మద్దతు తెలిపారు. గ్రామాల నుంచి వచ్చిన ప్రజలతో నామినేషన్ కార్యక్రమం సందడిగా సాగింది. కుటుంబ సభ్యులు, పార్టీ శ్రేణుల సమక్షంలో ఆమె నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారులకు సమర్పించారు. తన తండ్రి అంబవరం వెంకటరెడ్డి



ఆశయాలను నెరవేర్చాలనే సంకల్పంతో, భర్త ముత్యాల భాస్కర్ రెడ్డి ప్రోత్సాహంతో ప్రజాసేవకు సిద్ధమైనట్లు లక్ష్మీదేవి తెలిపారు. అన్న డాక్టర్ అంబవరం కొండారెడ్డి, బావ ముత్యాల మాబురెడ్డి, తమ్ముడు జనార్దన్ రెడ్డి ఎన్నికల ప్రయాణంలో అండగా నిలుస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ ప్రజల ఆశీస్సులు, సహకారంతో సర్పంచ్ ఎన్నికల బరిలో నిలిచానని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారం, రహదారుల అభివృద్ధి, పారిశుద్ధ్యం, వీధి దీపాల ఏర్పాటు, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడటం తన ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు.
తండ్రి ఆశయాలను కొనసాగిస్తూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే తన ధ్యేయమని, నాగలకుంట్ల (సంచర్ల) గ్రామ పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని ముత్యాల లక్ష్మీదేవి వెల్లడించారు.

యర్రగుడిదిన్నె లో సర్పంచ్ అభ్యర్థిగా గంగుల సరళమ్మ నామినేషన్.

రుద్రవరం. పల్లె వెలుగు : మండల పరిధిలోని ముచ్చటగా మూడవసారి గంగుల సరళమ్మ బరిలో నిలిచారు. గ్రామపంచాయతీ ఎన్నికలలో రిజర్వేషన్లలో భాగంగా యర్రగుడిదిన్నె గ్రామపంచాయితీ అన్ రిజర్వ్ డ్ మహిళకు కేటాయించడంతో వైసిపి సీనియర్ నాయకుడు గంగుల మనోహర్ రెడ్డి సతీమణి గంగుల సరళమ్మను బరిలో నిలిపారు. వైసిపి మద్దతుదారులుగా గంగుల సరళమ్మ సోమవారం గ్రామంలోని యర్రగుడిదిన్నె గ్రామంలో సర్పంచ్ బరిలో నామినేషన్ కేంద్రంలో ఆర్వో సమక్షంలో



నామినేషన్ దాఖలు చేశారు. గతంలో రెండు దఫాలుగా గంగుల సరళమ్మ గ్రామ సర్పంచ్ గా ప్రజలకు పాలన అందించారు. ముచ్చటగా మూడవసారి గ్రామ అభివృద్ధి కాంక్షిస్తూ ప్రజలకు సుపరిపాలన అందించేందుకు సర్పంచ్ బరిలో నిలిచారు. ఈ నామినేషన్ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకుడు గంగులు మనోహర్ రెడ్డి, గంగుల విజయసింహారెడ్డి, గంగుల సుదర్శన్ రెడ్డి, గంగుల పుల్లారెడ్డి పలువురు వైసీపీ నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. అలాగే మండలంలోని చిత్రేణిపల్లె గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా వైసిపి మద్దతుదారుడు మాధవ గౌడ్ ఆలమూరు గ్రామంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రం నందు నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో చిత్రేణిపల్లె, ముకుందాపురం గ్రామాలకు చెందిన వైసిపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మహానంది క్షేత్రంలో కార్తీక శోభ

-భక్తిశ్రద్ధలతో అభిషేకాలు. కేదారేశ్వర స్వామి నోములు -అలరించిన మహిళల కోలాట నృత్య ప్రదర్శనలు

మహానంది, పల్లె వెలుగు మహానంది పుణ్యక్షేత్రంలో కార్తీక మాసం మొదటి సోమవారం నోములను భక్తులు అధిక సంఖ్యలో







కార్తీక శోభ సంతరించుకుంది. అశేష భక్త జనవాహినితో క్షేత్రం కలకలాడింది. భక్తులు తెల్లవారుజామునుంచే వేలాదిగా తరలివచ్చి ఆలయంలోని పుష్కరిణిలలో పుణ్య స్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందిశ్వర స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. అభిషేక ప్రియుడైన పరమేశ్వరుడికి భక్తులు అధిక సంఖ్యలో అభిషేకాలు నిర్వహించారు. కార్తీక మాసం ప్రత్యేకతను సంతరించుకున్న కేదారేశ్వర స్వామి నిర్వహించుకున్నారు. క్షేత్ర పరిసరాలు భక్తులతో కళకళలాడాయి.భక్తుల రద్దీ దృష్టిలో పెట్టుకుని చైర్మన్ నరాల చంద్రమౌళీశ్వర్ రెడ్డి, ఈవో శ్రీనివాసరెడ్డిలు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా తగు చర్యలు చేపట్టారు. ప్రసాదాల కౌంటర్ వద్ద ఒకటే కౌంటర్ ఏర్పాటు చేయడంతో భక్తులు కొంత మేరకు ఇబ్బందులు పడ్డారు. క్షేత్రంలో మహిళల కోలాట నృత్య ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి.

కన్నుల పండువగా జలహారతి

మహానంది, పల్లె వెలుగు మహానంది రాత్రి వేద పండితులు వేదమంత్రాలతో ఈవో ప్రత్యేక హారతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో





పుణ్యక్షేత్రంలో జల హారతి కార్యక్రమాన్ని భక్తులకు కన్నుల పండువగా నిర్వహించారు. సోమవారం శ్రీనివాసరెడ్డి చే ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అర్చకులు గంగాదేవికి ఆలయ ఏఈఓ మధు, అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్లకు 2వ రోజు విశేష స్పందన.

-8 మండలాల్లో సర్పంచ్ స్థానాలకు 430, వార్డు సభ్యుల స్థానాలకు 1579 నామినేషన్లు దాఖలు.

-నామినేషన్ల ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి.

-ఎన్నికల నిర్వహణలో నిబంధనలను ఖచ్చితంగా పాటించాలి.

-జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల జిల్లాలో మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియకు రెండో రోజైనా సోమవారం విశేష స్పందన లభించిందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి వెల్లడించారు. నంద్యాల రెవెన్యూ డివిజన్ పరిధిలోని 8 మండలాల్లో సర్పంచ్ స్థానాలకు 430 నామినేషన్లు, వార్డు సభ్యుల స్థానాలకు 1579 నామినేషన్లు దాఖలైనట్లు కలెక్టర్ వివరించారు.



ఈ నెల 15వ తేదీ నుంచి 17వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణకు నిర్ణయించిన నేపథ్యంలో రెండో రోజు నమోదైన వివరాల ప్రకారం ఆళ్లగడ్డ మండలంలో సర్పంచ్ స్థానాలకు 46, వార్డు సభ్యుల స్థానాలకు 164 నామినేషన్లు దాఖలయ్యాయి. చాగలమర్రి మండలంలో 60 సర్పంచ్, 223 వార్డు సభ్యుల నామినేషన్లు, దొర్నిపాడు మండలంలో 35 సర్పంచ్, 126 వార్డు సభ్యుల నామినేషన్లు, గోస్పాడు మండలంలో 43 సర్పంచ్, 183 వార్డు సభ్యుల నామినేషన్లు నమోదయ్యాయి. అదేవిధంగా నంద్యాల మండలంలో 83 సర్పంచ్, 259 వార్డు సభ్యుల నామినేషన్లు, రుద్రవరం మండలంలో 75 సర్పంచ్, 245 వార్డు సభ్యుల నామినేషన్లు, సిరివెళ్ల మండలంలో 43 సర్పంచ్, 172 వార్డు సభ్యుల నామినేషన్లు, ఉయ్యాలవాడ మండలంలో 45 సర్పంచ్, 197 వార్డు సభ్యుల నామినేషన్లు దాఖలయ్యాయి.

నామినేషన్ల స్వీకరణ నుంచి ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రతి దశలోనూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయడంతో పాటు నామినేషన్ల పరిశీలన, ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, నిష్పక్షపాత వైఖరిని పాటించాలని సూచించారు.

ఎన్నికల వేళ అక్రమ మద్యం పట్టివేత.. ఒకరి అరెస్టు

10 బాక్సుల ఆంధ్ర మద్యం స్వాధీనం చేసుకున్న ఉలిందకొండ పోలీసులు

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామంలో



అక్రమంగా విక్రయించేందుకు నిల్వ ఉంచిన భారీ మద్యం నిల్వలను ఉలిందకొండ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం మధ్యాహ్నం కల్లూరు మండలం తడకనపల్లి గ్రామంలో నిర్వహించిన ఈ దాడుల్లో ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్సై పి. నిరంజన్ రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. తడకనపల్లి గ్రామానికి చెందిన తాడి భాస్కర్, ఎన్నికల నిమిత్తం గ్రామంలో అమ్ముకోవడానికి ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా మద్యాన్ని నిల్వ ఉంచినట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో సోమవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఎస్సై నిరంజన్ రెడ్డి తన సిబ్బందితో కలిసి తడకనపల్లిలోని తాడి భాస్కర్ కల్లం దొడ్డి బయలు స్థలంపై ఆకస్మిక దాడి చేశారు. ఈ తనిఖీల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 10 బాక్సుల ఆంధ్ర మద్యం పట్టుబడింది. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు, నిందితుడు తాడి భాస్కర్‌ను అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

శ్రీకృష్ణుడి దేవస్థాన నిర్మాణానికి భూమిపూజ .....,

నూతన శ్రీకృష్ణుడి దేవస్థాన నిర్మాణానికి శ్రీకారం,,,,,,,

ఎమ్మిగనూరు పల్లె వెలుగు నవంబర్ 16ఎమ్మిగనూరు మండలం కడిమెట్ల



గ్రామంలో నూతనంగా నిర్మించనున్న శ్రీకృష్ణుడి దేవస్థానానికి భూమిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మిగనూరు నియోజకవర్గ సీనియర్ నాయకులు, రాష్ట్ర కార్యదర్శి ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఆలయ నిర్మాణ పనులకు భూమిపూజ చేసి శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా ఆలయ పెద్దలు, గ్రామ పెద్దలు పుల్లయ్య స్వామి, నాగభూషణం రెడ్డి కడిమెట్ల గ్రామ ప్రజలు పాల్గొని పూజా కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ఈ నూతన దేవస్థాన నిర్మాణం గ్రామంలో ఆధ్యాత్మికతకు, భక్తిభావానికి ప్రతీకగా నిలవాలని, ఆలయ నిర్మాణం ఎటువంటి ఆటంకాలు లేకుండా త్వరితగతిన పూర్తికావాలని ఆకాంక్షించారు.

జి జంబులదిన్నె సర్పంచ్ గా నామినేషన్ వేసిన గజ్జల కళావతి

ఆళ్లగడ్డ ప్రతినిధి నవంబర్ 16 ఆళ్లగడ్డ మండలంలో గ్రామపంచాయతీ



ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ రెండో రోజు కొనసాగింది. రెండో రోజు జి.జంబులదిన్నె. గ్రామ సర్పంచ్ పదవికి వైసిపి అభ్యర్థిగా గజ్జల కళావతి నామినేషన్ వేశారు. సోమవారం నాడు ఆళ్లగడ్డ మండలం ఓబులంపల్లె గ్రామ కేంద్రంలో జి జంబలదిన్నె సర్పంచ్ అభ్యర్థిగా గజ్జల కళావతి నామినేషన్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేశారు సర్పంచ్ అభ్యర్థి గజ్జల కళావతి ఆళ్లగడ్డ మాజీ ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి సతీమణి.

డబ్ల్యూ.గోవిందిన్నె లో వైసీపీ ని విడి టీడీపీలో చేరికలు

ఆళ్లగడ్డ ప్రతినిధి నవంబర్ 16, పల్లె వెలుగు ఆళ్లగడ్డ నియోజకవర్గం దొర్నిపాడు మండలం డబ్ల్యూ. గోవిందిన్నె గ్రామానికి చెందిన 20 కుటుంబాలు



సోమవారం వైసిపి వీడి టిడిపిలో చేరారు. పార్టీలో చేరిన పెద్దబోయిన శివప్రసాద్, బోనాల శంకరయ్య, బోనాల శివరామయ్య, సాంబశివరావు, కర్ణాటి కృష్ణారెడ్డి, గుండుపాపల శంకరయ్య, శివ రాముడు, సాంబశివుడు, పెద్ద జనార్ధన్, ఓర్వకంటి శివయ్య, లక్ష్మయ్య, కొత్త దర్గా ఆలీషా లతో పాటు 20 కుటుంబాలు వారికి ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆళ్లగడ్డ తాలూకాలో అభివృద్ధి పనులను చూసి, సీఎం చంద్రబాబు నాయుడు అమలు చేసిన పథకాలకు ఆకర్షితులై పలువురు టిడిపిలోకి రావడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

అహోబిలం టిడిపి సర్పంచ్ గా నామినేషన్ వేసిన సానే రామాంజనేయులు

ఆళ్లగడ్డ ప్రతినిధి నవంబర్ 16 పల్లె వెలుగు ఆళ్లగడ్డ మండలంలో గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ రెండో రోజు కొనసాగింది. రెండో రోజు అహోబిలం గ్రామ సర్పంచ్ పదవికి టిడిపి అభ్యర్థిగా సానే రామాంజనేయులు నామినేషన్ వేశారు. సోమవారం నాడు ఆళ్లగడ్డ మండలం అహోబిలం గ్రామ కేంద్రంలో అహోబిలం సర్పంచ్ అభ్యర్థిగా సానే రామాంజనేయులు నామినేషన్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు గూడూరు సంజీవ రాయుడు రమణ తదితరులు పాల్గొన్నారు.



మర్రి పల్లె టిడిపి సర్పంచ్ గా నామినేషన్ వేసిన పత్తి నాగేశ్వరమ్మ

ఆళ్లగడ్డ ప్రతినిధి నవంబర్ 16 పల్లె వెలుగు



ఆళ్లగడ్డ మండలంలో గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ రెండో రోజు కొనసాగింది. రెండో రోజు మర్రిపల్లె గ్రామ సర్పంచ్ పదవికి టిడిపి అభ్యర్థిగా పత్తి నాగేశ్వరమ్మ నామినేషన్ వేశారు. సోమవారం నాడు ఆళ్లగడ్డ మండలం ఆర్ కృష్ణాపురం గ్రామ కేంద్రంలో మర్రిపల్లె సర్పంచ్ అభ్యర్థిగా పత్తి నాగేశ్వరమ్మ నామినేషన్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు పత్తిపాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు

రెండో రోజు సర్పంచ్ వార్డు నెంబర్లకు నామినేషన్లు

దొర్నిపాడు నవంబర్ 16 పల్లె వెలుగు న్యూస్ చాకరాజువేముల గ్రామంలో నామినేషన్కు



బయులు దేరుతున్న దృశ్యం గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా రెండవ రోజు నామినేషన్ ప్రక్రియలో భాగంగాగుండుపాపల, డబ్యూగోవిందిన్నె ,దొర్నిపాడు రామచంద్రపురం బుర్రారెడ్డిపల్లి కిష్టిపాడు చాకరాజు వేముల





గ్రామాల సర్పంచ్ అభ్యర్థులుగా 35 మంది వార్డు సభ్యులుగా 126 మంది అభ్యర్థుల నామినేషన్ దాఖలు చేసినట్లు ఎంపీడీఓ సావిత్రి సోమవారం తెలిపారు. చాకరాజువేముల గ్రామంలో గ్రామ పెద్దల ఆధ్వర్యంలో మహబూబ్బీ నామినేషన్వేశారు.మొదటిరోజు పది సర్పంచులకు 23 వార్డు సభ్యులకు నామినేషన్లు వచ్చినట్లుతెలిపారు మొత్తం 45 సర్పంచ్ అభ్యర్థులు 138 వార్డు సభ్యులకు నామినేషన్ వచ్చినట్లు ఆమె తెలిపారు

శ్రీ బాగ్ ఒప్పందాని నవంబర్ 16 తేదీ లోపు అమలు చేయాలని,,,,,,

ఎమ్మిగనూరు పల్లె వెలుగు నవంబర్ 16 శ్రీ బాగ్ ఒప్పందాని నవంబర్ 16 తేదీ లోపు అమలు చేయాలని ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు ప్రభుత్వానికి కోరారు ఈ



సందర్భంగా ప్రజా సంఘాలు ఐక్య వేదిక నాయకులు బతకన్న, గణేష్, మాల నరసన్న, నాగరాజు , పందికొన ఈరన్న విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ శ్రీ బాగ్ ఒప్పందాని నవంబర్ 16 తేదీ లోపు అమలు చేయాలని వారు కోరారు శ్రీ బాగ్ ఒప్పందాని అమలు చేయకుంటే ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన చేపడుతామని ప్రజా సంఘాల నాయకులు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు

నరసాపురం పంచాయతీ ఎన్నికల బరిలో జనసేన అభ్యర్థులు సర్పంచ్, రెండో వార్డు స్థానాలకు నామినేషన్లు దాఖలు





కాశినాయన, నవంబర్ 16 (పల్లె వెలుగు):కడప జిల్లా కాశినాయన మండలం నరసాపురం గ్రామ పంచాయతీ ఎన్నికల్లో జనసేన పార్టీ తరఫున సర్పంచ్, రెండో వార్డు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు.సర్పంచ్ అభ్యర్థిగా ఉల్లి నాగరాజు సతీమణి ఉల్లి రామలక్ష్మమ్మ, రెండో వార్డు అభ్యర్థిగా పసుపులేటి జమలయ్య సతీమణి పసుపులేటి జయలక్ష్మి నామినేషన్లు సమర్పించారు.ఈ అభ్యర్థులకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ నాగిరి రమణయ్య, శిలంశెట్టి లక్ష్మయ్య, శెట్టి రామ్ మోహన్ రాయల్ ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గ్రామ అభివృద్ధి, ప్రజల సంక్షేమం, మెరుగైన పాలన లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని, ప్రజల ఆశీస్సులతో జనసేన పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పార్టీ శ్రేణులు ఆకాంక్షించారు.

వైభవంగా యాగంటి లో శ్రీ ఉమామహేశ్వరుల పల్లకిసేవ



బనగానపల్లె, నవంబర్ 16,పల్లెవెలుగు మండలం లోని యాగంటి, శ్రీ ఉమామహేశ్వర స్వామి వారి దేవస్థానం నందు నేడు సోమవారం సందర్భముగా స్వామిఅమ్మవార్ల పల్లకి సేవ నిర్వహించడం జరిగినది. శాస్త్రోక్తముగా పల్లకివద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయము నందు ఊరేగింపు నిర్వహించి, తీర్థప్రసాదములు అందజేయడం జరిగినది. ఈ కార్యక్రమము నందు ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పాండురంగా రెడ్డి, ఆలయ చైర్మన్ బండి మౌళీశ్వర రెడ్డి, సభ్యులు జె.సురేష్, గోపి, లక్ష్మీ రెడ్డి, భక్తులు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొనడం జరిగినది.పల్లకి సేవ అనంతరం పాతపాడు గ్రామ వాస్తవ్యులు దూలం తిమ్మారెడ్డి భక్తులకు ఆల్పాహార వితరణ చేయడం అయినది

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: Palleveluguneews9@gmail.com